# విశాల భారతి

3-04-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 89




## ఫ్యూచర్ సిటీ పనుల్లో వేగం పెంచాలి

- కేరళ నుంచి నేరుగా ఫ్యూచర్ సిటీకి సీఎం రేవంత్ రెడ్డి
- స్కిల్స్ యూనివర్సిటీ, ఎఫ్‌సీడీఏ కార్యాలయ పనుల తనిఖీ.
- భవన నిర్మాణాలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశం
- రూ.19 కోట్లతో జరుగుతున్న కార్యాలయ పనులపై ఆరా
- గతేడాది శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులపై రివ్యూ
- నాణ్యతలో రాజీ పడకుండా పనులు వేగవంతం చేయాలని వెల్లడి

02

## కాళేశ్వరంపై రాజ్యసభలో రగడ

- కేంద్రం సాయం లేకున్నా కాళేశ్వరం పూర్తి చేశాం
- చర్చ లేకుండానే 7 మండలాలను ఏపీలో కలపడంపై ఫైర్
- శంకుస్థాపనకు కేసీఆర్ వెళ్లారని, మద్దతు ఇచ్చారని గుర్తు
- కాళేశ్వరం కేసీఆర్ ఫ్యామిలీకి 'ఏటీఎం'లా మారిందని కిషన్ రెడ్డి
- ప్రాజెక్టులో అవకతవకలు ఉన్నాయని కాగ్ నివేదిక ఇచ్చింది
- కేసీఆర్ అవినీతిపై కాంగ్రెస్ చర్యలెందుకు తీసుకోవడం లేదని ప్రశ్న

04





## 16 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

- 16 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు
- ఈ నెల 16 నుండి 18 వరకు పార్లమెంట్ కీలక సెషన్
- లోక్‌సభ స్థానాలను 543 నుండి 816కు పెంచే అవకాశం
- పెరిగిన సీట్లలో 273 స్థానాలు మహిళలకు కేటాయింపు
- ఏపీలో 263, తెలంగాణలో 179 ఎమ్మెల్యే సీట్లకు ఛాన్స్
- వచ్చే ఎన్నికల నాటికే పునర్విభజన పూర్తి చేసే యోచన
- సీట్ల పెంపుతో ఎస్సీ, ఎస్టీ కోటా కూడా పెరగనుంది

02

## గ్రూప్1 అభ్యర్థులకు చుక్కెదురు



- గ్రూప్-1 నియామకాల్లో జోక్యం చేసుకోం- సుప్రీంకోర్టు
- పరీక్ష రద్దు చేయాలన్న అభ్యర్థుల పిటిషన్లు కొట్టివేత
- నియామకాలు సక్రమమేనన్న హైకోర్టు తీర్పునే సుప్రీం ఖరారు
- ఎంపిక అత్యంత పారదర్శకంగా జరిగిందని కోర్టుకు వివరణ
- ఎంపికైన వారు ఇప్పటికే విధుల్లో చేరారని వెల్లడి
- సుప్రీం తీర్పుతో గ్రూప్-1 నియామకాలపై సందిగ్ధత వీడింది

03




## గాంధీ సరోవర్‌కు అడ్డంకులు క్లియర్!

- గాంధీ సరోవర్‌పై పిటిషన్‌ను కొట్టేసిన ఎన్‌జీటీ
- పర్యావరణ ఉల్లంఘనలను నిరూపించడంలో విఫల
- అడ్డంకులు తొలగడంతో మూసీ పనులకు గ్రీన్ సిగ్నల్
- బాపూ ఘాట్ వద్ద 123 అడుగుల గాంధీ విగ్రహం
- 200 ఎకరాల్లో మ్యూజియం, రీక్రియేషన్ సెంటర్ల నిర్మాణ
- ఎన్‌జీటీ తీర్పుతో ప్రాజెక్టును వేగవంతం చేయనున్న సీఎం

02

తెలంగాణ రాష్ట్రంలో 2026–27 విద్యా సంవత్సరం నుంచి సరికొత్త విద్యా విధానాన్ని తీసుకువస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించినప్పటికీ, ఆచరణలో మాత్రం అడుగులు పడటం లేదు. వివిధ విద్యా కమిటీల మధ్య కనీస సమన్వయం లేకపోవడంతో నూతన విధానం అమలుపై తీవ్ర అనిశ్చితి నెలకొంది. క్షేత్రస్థాయిలో నివేదికలు సిద్ధం కావడంలో జాప్యం జరుగుతుండటంతో పాటు విధానపరమైన నిర్ణయాల్లో స్పష్టత లోపించింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం, మూడు ప్రత్యేక కమిటీలు ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా విడివిడిగా వ్యవహరిస్తుండటం విద్యా రంగ నిపుణులను విస్మయానికి గురిచేస్తోంది. ఈ గందరగోళ పరిస్థితి వల్ల కొత్త మార్పులు అసలు వస్తాయా లేదా అన్న సందేహాలు విద్యార్థులు, తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతున్నాయి.

# రేవంత్ సర్కార్‌కు లొంగని స్కూల్ల ఫీజులు..!




- కొత్త విద్యా విధానంపై కమిటీల మధ్య సమన్వయం కరువు
- ప్రైవేట్ స్కూళ్లలో 20-30శాతం ఫీజుల పెంపుతో సామాన్యుల బేజార్
- ఫీజు నియంత్రణ చట్టం సిద్ధమైనా అసెంబ్లీలో పెట్టని సర్కార్
- శ్రీధర్ బాబు, ఆకునూరి మురళి నివేదికలపై ముగియని ఉత్కంఠ
- రాజకీయ నేతల పెట్టుబడుల వల్లే నియంత్రణ లేదని విమర్శలు
- 2026 నుంచి అమలు అంటున్నా క్షేత్రస్థాయిలో అడుగు పడలేదు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

విద్యా రంగంలో నెలకొన్న ఈ దోపిడీపై ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి పి. తేజ తీవ్రంగా స్పందించారు. రాజకీయ నేతలే స్వయంగా విద్యా సంస్థల్లో పెట్టుబడులు పెట్టి విద్యావ్యాపారం చేస్తుండటం వల్లనే ఫీజుల నియంత్రణ జరగడం లేదని ఆయన ఆరోపించారు. ప్రభుత్వాలు మారుతున్నా పేద, మధ్యతరగతి ప్రజల కష్టాలు మాత్రం తీరడం లేదని, ఫీజుల భారం నేరుగా సామాన్యుల ఆర్థిక పరిస్థితిని దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యను ఒక లాభసాటి వ్యాపారంగా మార్చేసిన నేతలు, చట్టాలను తీసుకురావడంలో కావాలనే తాత్సారం చేస్తున్నారని ఆయన విమర్శించారు. కఠినమైన చట్టం లేకపోవడమే

మిగతా 2లో..

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు సంబంధించి ప్రభుత్వం పదేపదే హామీలు ఇస్తున్నప్పటికీ, ఇప్పటివరకు ఒక బలమైన చట్టాన్ని తీసుకురావడంలో విఫలమైంది. ఫీజుల నియంత్రణ బిల్లు సిద్ధమై ఏడాది కాలం గడుస్తున్నా, దానిని శాసనసభలో ప్రవేశపెట్టకపోవడం పాలకుల చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేస్తోంది. ప్రభుత్వ పెద్దలు చేస్తున్న ప్రకటనలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి తప్ప, సామాన్య ప్రజలకు ఉపశమనం కలిగించేలా చట్టబద్ధమైన చర్యలు చేపట్టడం లేదు. చట్టం లేనిదే ప్రైవేటు యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడం సాధ్యం కాదని అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఈ జాప్యం పరోక్షంగా కార్పొరేట్ విద్యా సంస్థలకు వరంగా మారుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ, ప్రైవేటు పాఠశాలలు అప్పుడే ప్రవేశాల ప్రక్రియను ముగించి ఫీజులు వసూలు చేయడం మొదలుపెట్టాయి. ముందస్తు అడ్మిషన్ల పేరుతో తల్లిదండ్రుల నుంచి భారీ మొత్తాలను దండుకుంటున్నాయి. ప్రతి ఏటా సుమారు 20 నుంచి 30 శాతం మేర ఫీజులను పెంచుతున్నారని, దీనివల్ల మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్ తలకిందులవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు సంవత్సరాలకు ఒకసారి గరిష్టంగా ఎనిమిది శాతం మాత్రమే ఫీజు పెంచేలా కఠిన నిబంధనలు తీసుకురావాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకోకపోవడంతో యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి.

## ఖమ్మం ఏజెన్సీకి నిధులేవి!

- ఖమ్మం జిల్లాకే నిధులన్నీ వెళ్తున్నాయని భద్రాద్రి ప్రజల ఆవేదన
- భట్టి, పొంగులేటి, తుమ్మల ఇలాకాల్లోనే వేల కోట్ల అభివృద్ధి
- మధిర, పాలేరు, ఖమ్మంకు లిఫ్ట్ ఇరిగేషన్, రోడ్ల నిధుల జాతర
- కొత్తగూడెం అభివృద్ధిని మంత్రులు పట్టించుకోవడం లేదని విమర్శ
- ఏజెన్సీలో హాస్పిటల్, బైపాస్ రోడ్డు లేక జనం అవస్థలు
- ఖమ్మంతో పాటి భద్రాద్రి జిల్లాపై ఫోకస్ చేయాలని డిమాండ్

03




## భూభారతి పోర్టల్ సేవలు షురూ..!

- భూ వివాదాలకు చెక్ పెట్టేలా కొత్త పోర్టల్ ప్రారంభం
- పాత వ్యవస్థలోని లోపాలను సరిదిద్దుతూ నూతన విధానం
- రోవర్ల సాయంతో అక్షాంశాల ఆధారంగా కచ్చితమైన కొలతలు
- ప్రతి భూమికి ఆధార్ తరహాలో ప్రత్యేక గుర్తింపు సంఖ్య
- తొలి దశలో 5 మండలాల్లో ప్రయోగాత్మక అమలు
- సాటిలైట్ చిత్రాల అనుసంధానంతో అక్రమాలకు అడ్డుకట్ట



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

రాష్ట్రవ్యాప్తంగా సామాన్య రైతాంగాన్ని దశాబ్దాలుగా వేధిస్తున్న భూమి సరిహద్దు తగాదాలు, యజమాన్య సమస్యలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సరికొత్త విప్లవానికి శ్రీకారం చుట్టింది. భూరికార్డుల నిర్వహణలో పారదర్శకతను పెంచుతూ, వివాదరహిత సేవలందించే లక్ష్యంతో రూపొందించిన 'ఇంటిగ్రేటెడ్ భూభారతి' పోర్టల్‌ను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం లాంఛనంగా ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం మిఠాయిపల్లి వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో భూభారతి లోగో,

మిగతా 3లో..

## తెలంగాణ గొంతు కోస్తారా?



- ఆర్డినెన్స్‌తో 7 మండలాలను ఏపీకి ఇచ్చింది బీజేపీయే
- పార్లమెంట్‌లో అబద్ధాలు చెప్తూ తెలంగాణకు ద్రోహం
- కాళేశ్వరంపై రేవంత్, కిషన్ రెడ్డిలది ఒకే మాట.. ఒకే బాట
- కాళేశ్వరం నీళ్లు పారుతున్నాయి దమ్ముంటే రా
- సాగు పెరగడానికి కాళేశ్వరమే కారణమం
- 16 మంది ఎంపీలున్నా తెలంగాణ వాదాన్ని అణచివేస్తున్నారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర విభజన చట్టానికి అడ్డగోలుగా సవరణలు తీసుకువచ్చి, ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌కు ధారాదత్తం చేసిన ఘనత భారతీయ జనతా పార్టీదేనని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆర్డినెన్స్ ద్వారా ఆనాడు చేసిన ఈ చారిత్రక తప్పిదంలో ప్రస్తుత కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సైతం ప్రత్యక్ష భాగస్వామ్యం

మిగతా 3లో..

## ఉపాధి హామీ నిధులు హాంఫట్!

- ఉమ్మడి కరీంనగర్‌లో రూ.27.63 కోట్ల నిధుల గోల్‌మాల్
- పని చేయకుండానే రికార్డులు సృష్టించి కోట్లు కాజేస్తున్నారు
- నిధులు వాపస్ వెళ్తాయనే నెపంతో అక్రమాలకు తెర
- అధికారుల సహకారంతోనే సర్పంచుల చేతివాటం
- నాణ్యత లేని పనుల వల్ల 6 నెలలకే రోడ్లు శిథిలం
- అవినీతి అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ఉపాధి హామీ పథకం ద్వారా కేటాయిస్తున్న నిధులు క్షేత్రస్థాయిలో పక్కదారి పడుతున్నాయి. పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా నిర్మిస్తున్న సిమెంట్ కాంక్రీట్ రోడ్ల పనుల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి.

మిగతా 2లో..

GENERAL news
WWW.VISHALABHARATI.COM
విశాల భారతి

## రేవంత్ సర్కార్‌కు లొంగని స్కూళ్ల ఫీజులు..!

**మొదటిపేజీ తరువాయి**



ఈ అరాచకానికి మూలకారణమని పేర్కొన్నారు. తెలంగాణ విద్యా కమిషన్ సభ్యుడు ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వరరావు ఈ అంశంపై స్పందిస్తూ, రాష్ట్రంలోని 20 వేలకు పైగా ఉన్న ప్రైవేట్ పాఠశాలల సమస్యలపై తాము లోతైన అధ్యయనం చేశామని తెలిపారు. పాఠశాలలను ఐదు విభాగాలుగా వర్గీకరించి, యాజమాన్యాలు, తల్లిదండ్రులతో పలుమార్లు చర్చలు జరిపామని వివరించారు. ముసాయిదా చట్టాన్ని ఇప్పటికే ప్రభుత్వానికి సమర్పించినట్లు ఆయన ధ్రువీకరించారు. ప్రతిపాదిత ఫీజు నియంత్రణ బిల్లు ఇంకా చర్చల స్థాయిలోనే పెండింగ్‌లో ఉందని, అది శాసనసభలో ఆమోదం పొంది చట్టంగా మారినప్పుడే క్షేత్రస్థాయిలో మార్పులు వస్తాయని స్పష్టం చేశారు. త్వరితగతిన ఈ ప్రక్రియ పూర్తి కావాలని ఆయన ఆకాంక్షించారు. రేవంత్ సర్కార్ 2026-27 నుంచి సంస్కరణలు అమలు చేస్తామని చెబుతున్నా, ఆచరణలో కమిటీల పనితీరు నెమ్మదిగా ఉంది. 2024 జూలైలో మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం ఆశించిన స్థాయిలో సమావేశాలు నిర్వహించలేదు. రాష్ట్రంలో అమలు చేయాల్సిన విద్యా సంస్కరణలపై సూచనలు ఇవ్వాలని ఆదేశించినా, ఆ తర్వాత ఫాలోఅప్ చర్యలు కరువయ్యాయి. విద్యా రంగంలో సమూల మార్పుల కోసం వేసిన ఈ ఉన్నత స్థాయి కమిటీ నిద్రావస్థలో ఉండటం విద్యావేత్తలను కలవరపెడుతోంది. కీలకమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయంలో నాయకత్వ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. మరోవైపు 2024 సెప్టెంబర్‌లో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అధ్యక్షతన విద్యా కమిషన్ ఏర్పాటైంది. ఈ కమిషన్ సమర్పించిన కొన్ని నివేదికలు వివాదాస్పదంగా మారడం చర్చనీయాంశమైంది. కమిషన్ ప్రతిపాదించిన కొన్ని అంశాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడంతో ప్రభుత్వం వాటిని అమలు చేయడానికి వెనుకాముందు ఆడుతోంది. దీనివల్ల ఒక అడుగు ముందుకు పడితే రెండడుగులు వెనక్కి పడే పరిస్థితి ఏర్పడింది. నివేదికల్లోని సిఫార్సుల కంటే వివాదాలే ఎక్కువగా ప్రచారంలోకి రావడంతో అసలు లక్ష్యం పక్కదారి పట్టింది. అధికారుల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడం ఈ సమస్యను మరింత క్లిష్టతరం చేస్తోంది. ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి మళ్ళీ 2025 ఆగస్టులో కే. కేశవరావు నేతృత్వంలో మరో కమిటీని ఏర్పాటు చేయడం గమనార్హం. ఈ కమిటీకి అక్టోబర్ 30, 2025 లోపు నివేదిక సమర్పించాలని గడువు విధించినా, అది ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. కమిటీల మీద కమిటీలు వేయడం తప్ప, ఫలితాలు రావడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి కమిటీ తమదైన శైలిలో నివేదికలు సిద్ధం చేస్తున్నా, వాటిని ఒకచోట చేర్చి సమగ్ర విద్యా చట్టాన్ని రూపొందించే నాథుడే కరువయ్యారు. కాలయాపన చేయడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతోంది. రాష్ట్రంలోని వివిధ విద్యా కమిటీల మధ్య సమన్వయం కుదర్చడం ఇప్పుడు ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది. ఒక కమిటీ చేసిన సిఫార్సులను మరో కమిటీ వ్యతిరేకిస్తుండటంతో అధికారులు ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నేరుగా జోక్యం చేసుకుని ఈ కమిటీల పనితీరును సమీక్షించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. విద్యా సంవత్సరం ముగింపు దశకు వస్తున్నా, వచ్చే ఏడాది ఎలాంటి విధానం ఉంటుందో స్పష్టత ఇవ్వకపోవడం వల్ల పాఠశాలల యాజమాన్యాలు తమకు నచ్చినట్లుగా వ్యవహరిస్తున్నాయి. స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడమే ఈ గందరగోళానికి కారణం. తల్లిదండ్రుల సంఘాలు కూడా ఈ విషయంపై పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి.

# ఉపాధి హామీ నిధులు హాంఫట్!

**మొదటిపేజీ తరువాయి**



ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల్లో రహదారుల నిర్మాణం జరగకపోయినా జరిగినట్లు రికార్డులు సృష్టించి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి స్వాహా చేస్తున్నారు. నిధులు మంజూరైన లక్ష్యాన్ని నీరుగారుస్తూ సొంత లాభం కోసం ప్రభుత్వ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. పారదర్శకతకు నిలవాల్సిన రికార్డులు ఇప్పుడు అవినీతికి అద్దం పడుతున్నాయి. జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద సుమారు 27.63 కోట్ల రూపాయల వ్యయంతో 397 పనులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పనులన్నింటినీ పూర్తి చేయడానికి గడువు కేవలం పది రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో యంత్రాంగంలో ఒక్కసారిగా కలకలం మొదలైంది. నిర్దేశిత సమయంలోగా పనులు పూర్తి చేయకపోతే నిధులు తిరిగి కేంద్రానికి వెళ్లిపోతాయనే సాకుతో అధికారులు అక్రమాలకు తెరలేపారు. గడువు ముగియకముందే పనులు పూర్తయినట్లు చూపించి బిల్లులు క్లెయిమ్ చేసేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. క్షేత్రస్థాయిలో కనీసం మట్టి పని కూడా మొదలుకాని చోట సైతం రోడ్లు పూర్తయినట్లు తప్పుడు నివేదికలు సిద్ధం చేయడం గమనార్హం.

నిర్మాణ పనుల పురోగతిని, నాణ్యతను నమోదు చేసే అత్యంత కీలకమైన మెజర్‌మెంట్ బుక్ (ఎంబీ) ఇప్పుడు అక్రమార్కుల చేతిలో ఆయుధంగా మారింది. వాస్తవానికి ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి కొలతలు నమోదు చేయాల్సి ఉంటుంది. కానీ ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో కార్యాలయాల్లోనే కూర్చుని అంచనాలు సిద్ధం చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పనులు జరగకుండానే ఎంబీ రికార్డుల్లో అంకెలు వేసి బిల్లులు తయారు చేస్తున్నారు. రికార్డుల నమోదులో చూపిస్తున్న వేగం పనుల అమలులో ఎక్కడా కనిపించడం లేదు. ఈ తతంగం అంతా కొందరు సర్పంచులు, సాంకేతిక అధికారుల కనుసన్నల్లోనే సాగుతోంది. కేంద్ర నిధులు వెనక్కి వెళ్తే పైస్థాయి అధికారుల నుంచి వేటు పడుతుందనే భయంతో కిందిస్థాయి సిబ్బంది నిబంధనలను గాలికొదిలేస్తున్నారు. నాణ్యతతో కూడిన పనులు చేయడం కంటే కాగితాల మీద పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒకవేళ ఎక్కడైనా పనులు చేపట్టినా అవి అత్యంత నాసిరకంగా ఉంటున్నాయి. సిమెంట్, ఇసుక మిశ్రమంలో సరైన నిష్పత్తి పాటించకుండా కేవలం పైపైన పూత పూసి నిధులు కాజేస్తున్నారు. నాణ్యత పరీక్షలు నిర్వహించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ కళ్లు మూసుకుంటున్నారని స్థానికులు మండిపడుతున్నారు. నిధుల వినియోగంపై పర్యవేక్షణ లోపించడం అక్రమార్కులకు వరంగా మారింది. గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన కీలక అధికారులు సైతం ఈ వ్యవహారంలో మిన్నకుండిపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. జిల్లా స్థాయి అధికారులు పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. అక్రమ బిల్లులను ఆమోదించవద్దని నిబంధనలు చెబుతున్నా గడువు ఒత్తిడిని సాకుగా చూపి సంతకాలు చేసేస్తున్నారు. ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నా పట్టించుకోని తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన చోట స్వార్థ ప్రయోజనాలకు పెద్దపీట వేస్తోంది. లోపాయికారీ ఒప్పందాలతో నిధుల పంపిణీ జరుగుతోందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పల్లెల్లో పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. 397 పనులకు సంబంధించి ప్రభుత్వం నుంచి వచ్చిన 27.63 కోట్ల రూపాయల నిధులు సద్వినియోగం కావడం లేదు. పది రోజుల స్వల్ప వ్యవధిలో ఇన్ని పనులు పూర్తి చేయడం అసాధ్యమని తెలిసినా అధికారులు తప్పుడు మార్గాలను ఎంచుకున్నారు. నాణ్యత లేని రోడ్ల వల్ల భవిష్యత్తులో ప్రజలకు ఇబ్బందులు తప్పవని తెలిసినా పట్టించుకోవడం లేదు. కేవలం బిల్లుల చెల్లింపు కోసమే ప్రాధాన్యత ఇస్తూ పనుల నాణ్యతను విస్మరించారు. ఫలితంగా అభివృద్ధి కుంటుపడటమే కాకుండా ప్రభుత్వ లక్ష్యం దెబ్బతింటోంది. అక్రమ పద్ధతుల్లో నిర్మించిన రోడ్లు కనీసం ఆరు నెలలు కూడా మనుగడలో ఉండటం లేదు. నాసిరకం మెటీరియల్ వాడటం వల్ల కొద్దిపాటి వర్షానికే రోడ్లు గుంతలమయంగా మారుతున్నాయి. ఒకసారి నిధులు ఖర్చయినట్లు రికార్డుల్లో చూపిస్తే మళ్లీ అదే చోట కొత్త రోడ్డు వేయడానికి అవకాశం ఉండదు. దీంతో గ్రామస్థులు ఏళ్ల తరబడి అధ్వాన్నపు రహదారులపైనే ప్రయాణించాల్సి వస్తోంది. అభివృద్ధికి అందాల్సిన నిధులు కొందరు వ్యక్తుల జేబుల్లోకి వెళ్తుంటే సామాన్య ప్రజలు నష్టపోతున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా స్థానిక కూలీలకు అందాల్సిన పనిదినాలు కూడా యంత్రాల వాడకం వల్ల తగ్గిపోతున్నాయి. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ అవినీతి పర్వంపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కేవలం రికార్డుల ఆధారంగా కాకుండా స్వతంత్ర బృందాలతో తనిఖీలు చేయిస్తే అసలు నిజాలు బయటపడతాయి. ఎంబీ రికార్డుల్లో నమోదు చేసిన కొలతలకు, భూమిపై ఉన్న పనులకు మధ్య పొంతన లేదని ప్రాథమికంగా తెలుస్తోంది. అక్రమాలకు పాల్పడినట్లు తేలితే సంబంధిత సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. రికవరీ నోటీసులు జారీ చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తేనే భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కావు. సామాజిక తనిఖీ బృందాలు కూడా ఈ అక్రమాలను గుర్తించడంలో విఫలమవుతున్నాయి. ఒకవేళ లోపాలు గుర్తించినా అవి ఉన్నతాధికారుల వరకు చేరకముందే కనుమరుగవుతున్నాయి. ఉపాధి హామీ పథకం ఆశయం నెరవేరాలంటే క్షేత్రస్థాయిలో పారదర్శకత పెరగాలి. ప్రతి పైసా ఖర్చుపై గ్రామసభల్లో చర్చ జరగాలి. కానీ ప్రస్తుతం అంతా రహస్యంగా, కార్యాలయాల గోడల మధ్యే ముగిసిపోతోంది. సామాన్య ప్రజలకు తమ గ్రామంలో జరుగుతున్న పనుల వివరాలు తెలుసుకునే అవకాశం లేకుండా పోయింది. సమాచార హక్కు చట్టం కింద అడిగినా రికార్డులు చూపించడానికి అధికారులు వెనకాడుతున్నారు. నిధులు వాపస్ వెళ్లకూడదనే ఉద్దేశం మంచిదే అయినా దాని వెనుక అవినీతిని ప్రోత్సహించడం నేరమే అవుతుంది. ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధికి తోడ్పడాల్సింది పోయి నిధుల వేటలో పడటం బాధాకరం. కొందరు నిజాయితీ గల అధికారులు ఒత్తిళ్లకు తలొగ్గి సంతకాలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. వ్యవస్థలో పేరుకుపోయిన ఈ జాడ్యాన్ని వదిలించకపోతే గ్రామీణ భారతం అభివృద్ధి చెందడం అసాధ్యం. కేంద్ర ప్రభుత్వం పంపిస్తున్న ప్రతి రూపాయి పేద ప్రజల కోసమేనని గుర్తించాలి. అక్రమ మార్గాల్లో సంపాదించే ధనం ప్రజల శాపనార్థాలకు గురవుతుందనే విషయాన్ని గుర్తించాలి.

## 16 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

**విశాలభారతి, జాతీయం:**



భారత రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేసే అత్యంత కీలకమైన నిర్ణయాల దిశగా కేంద్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియతో పాటు మహిళా రిజర్వేషన్ల చట్ట సవరణ బిల్లుకు ఆమోదముద్ర వేయడమే లక్ష్యంగా ఈ నెల 16 నుంచి 18 వరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహించాలని కేంద్రం నిశ్చయించింది. సాధారణంగా బడ్జెట్ సమావేశాలు ముగిసిన వెంటనే సభలు నిరవధికంగా వాయిదా పడాల్సి ఉన్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో అత్యవసర రాజ్యాంగ సవరణల నిమిత్తం ప్రత్యేక సమావేశాల నిర్వహణకు రంగం సిద్ధమైంది. లోక్‌సభలో నెలకొన్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో ఈ మూడు రోజుల భేటీ అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. అంతకుముందు లోక్‌సభలో కేంద్ర సాయుధ పోలీసు బలగాల కోసం ఉద్దేశించిన సీఏపీఎఫ్ జనరల్ అడ్మినిస్ట్రేషన్2026 బిల్లుకు సభ్యులు మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపారు. ఈ కీలక బిల్లు ఆమోదం పొందిన వెనువెంటనే సభ వాయిదా పడింది. అయితే ప్రభుత్వ యంత్రాంగం నిర్వహించాల్సిన అత్యవసర కార్యకలాపాల దృష్ట్యా ఈ నెల 16న సభను తిరిగి ప్రారంభించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కోరినట్లు స్పీకర్ ఓం బిర్లా సభాముఖంగా వెల్లడించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న ఈ సమావేశాల్లో సాధారణంగా ఉండే ప్రశ్నోత్తరాల సమయం ఉండదు. అదేవిధంగా శూన్య గంట కూడా నిర్వహించబోమని స్పీకర్ స్పష్టం చేయడంతో, పూర్తి సమయాన్ని కేవలం బిల్లుల చర్చకే కేటాయించబోతున్నట్లు స్పష్టమవుతోంది. ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 543 స్థానాల సంఖ్యను ఏకంగా 816కు పెంచేలా భారీ కసరత్తు జరుగుతోంది. పెరిగిన స్థానాల్లో 33 శాతం అంటే సుమారు 273 స్థానాలను మహిళలకు కేటాయించేలా చట్టంలో మార్పులు తీసుకురానున్నారు. ఈ చారిత్రాత్మక మార్పుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇప్పటికే ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతో పాటు పలు కాంగ్రెసేతర విపక్ష నేతలతో దఫదఫాలుగా చర్చలు జరిపారు. హోంమంత్రి అమిత్‌షా నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ కూడా పాల్గొన్నారు. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌తో పాటు తృణమూల్ కాంగ్రెస్ వంటి పార్టీల అభిప్రాయాలను కూడా ప్రభుత్వం కోరాల్సి ఉంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను కూడా 50 శాతం మేర పెంచాలని కేంద్ర మంత్రిమండలి ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ నిర్ణయం అమలులోకి వస్తే ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న 4,123 ఎమ్మెల్యే స్థానాల సంఖ్య 6,185కి చేరుకుంటుంది. జనాభా ప్రాతిపదికన జరిగే ఈ పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాల్లో రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉంది. ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రాతినిధ్యం గణనీయంగా పెరగనుంది. ప్రజాప్రతినిధుల సంఖ్య పెరగడం వల్ల పాలన ప్రజలకు మరింత చేరువవుతుందని, అభివృద్ధి పనుల పర్యవేక్షణ సులభతరం అవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రాల సరిహద్దుల్లో ఎటువంటి మార్పులు లేకుండా కేవలం అంతర్గత నియోజకవర్గాల పరిధులు మాత్రమే మారనున్నాయి. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న 175 ఎమ్మెల్యే స్థానాల సంఖ్య 263కి పెరిగే అవకాశం ఉంది. అలాగే తెలంగాణ అసెంబ్లీలో ఉన్న 119 స్థానాలు 179కి చేరుకోనున్నాయి. పార్లమెంట్ స్థానాల విషయంలోనూ ఏపీలో ప్రస్తుతం ఉన్న 25 సీట్లు 38కి, తెలంగాణలోని 17 సీట్లు 26కి పెరగనున్నాయి. ఈ పెంపుదల వల్ల ఉభయ రాష్ట్రాల్లోని రాజకీయ పార్టీలు తమ వ్యూహాలను మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కొత్త నియోజకవర్గాల ఏర్పాటుతో కొత్త నాయకత్వం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. స్థానాల సంఖ్య పెరగడం వల్ల సామాజిక వర్గాల వారీగా టికెట్ల కేటాయింపులో కూడా సమతుల్యత దెబ్బతినకుండా పార్టీలు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తూ 2029 సార్వత్రిక ఎన్నికల నాటికే ఈ పెరిగిన స్థానాలతో ఎన్నికలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ముందుగా మహిళా రిజర్వేషన్ చట్టంతో పాటు డీలిమిటేషన్ చట్టాలకు అవసరమైన సవరణలను ఈ సమావేశాల్లోనే ప్రవేశపెట్టనున్నారు. బిల్లులు ఆమోదం పొందిన వెంటనే దేశవ్యాప్తంగా డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటవుతుంది. ఈ కమిషన్ క్షేత్రస్థాయిలో జనాభా వివరాలను సేకరించి నియోజకవర్గాల సరిహద్దులను నిర్ణయిస్తుంది. సీట్ల పెంపుదల జరిగినప్పుడు జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు కేటాయించే రిజర్వుడు స్థానాల సంఖ్య కూడా అనుపాతంలో పెరుగుతుంది. దీనివల్ల బడుగు బలహీన వర్గాలకు చట్టసభల్లో మరింత ప్రాతినిధ్యం లభిస్తుంది. గతంలో 2023 సెప్టెంబరులో ఆమోదించిన చట్టం ప్రకారం మహిళా రిజర్వేషన్లు 2034 నుంచి అమలులోకి రావాలని భావించారు. రాజ్యాంగంలోని అధికరణలు 170(3), 81(3) ప్రకారం 2026 తర్వాత జరిగే జనాభా లెక్కల ఆధారంగానే పునర్విభజన జరగాల్సి ఉంది. అయితే తాజా సమాచారం ప్రకారం ప్రభుత్వం 2029 నుంచే వీటిని అమలు చేయాలని పట్టుదలగా ఉంది. దీనికోసం ప్రభుత్వం రాజ్యాంగ నిబంధనల్లో కొన్ని మార్పులు చేసే అవకాశం ఉంది. జనాభా గణన పూర్తి కాకపోయినా అందుబాటులో ఉన్న ప్రాథమిక గణాంకాల ఆధారంగానే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తున్నారు. దీనివల్ల మహిళా లోకానికి చట్టసభల్లో త్వరితగతిన అవకాశం దక్కుతుంది. నియోజకవర్గాల పునర్విభజన అంశంపై విపక్షాల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు ఈ పెంపుదల వల్ల అన్యాయం జరుగుతుందని కొందరు నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం జనాభా నిష్పత్తికి లోబడి అందరికీ న్యాయం చేసేలా సీట్ల కేటాయింపు ఉంటుందని హామీ ఇస్తోంది. లోక్‌సభ స్థానాల సంఖ్య 800 దాటినప్పుడు పార్లమెంట్ భవనంలోని వసతులు, నిర్వహణ అంశాలపై కూడా చర్చ జరుగుతోంది. నూతన పార్లమెంట్ భవనంలో పెరిగే సభ్యులకు సరిపడా సీటింగ్ సామర్థ్యం ఇప్పటికే కల్పించడం గమనార్హం. సభ్యుల సంఖ్య పెరిగినప్పుడు చర్చా సమయాన్ని ఎలా సర్దుబాటు చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. మహిళా రిజర్వేషన్ల అమలుపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం వాటా కల్పించడం వల్ల సమాజంలో లింగ సమానత్వం వస్తుందని మేధావులు పేర్కొంటున్నారు. చట్ట సవరణల ద్వారా కోటా లోపల కోటా ఉండాలనే డిమాండ్ కూడా కొన్ని రాజకీయ పార్టీల నుంచి వినిపిస్తోంది. ప్రభుత్వం మాత్రం ప్రస్తుతానికి ప్రధాన చట్టాన్ని అమలులోకి తేవడానికే ప్రాధాన్యత ఇస్తోంది. మహిళా రిజర్వేషన్లు అమలైతే గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు మహిళా నాయకత్వం బలోపేతం అవుతుంది. ఇది దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని రాజకీయ విశ్లేషకులు విశ్లేషిస్తున్నారు. ఈ బిల్లుకు విపక్షాల మద్దతు కూడగట్టడంపై కేంద్రం దృష్టి సారించింది.

## గాంధీ సరోవర్‌కు అడ్డంకులు క్లియర్!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**




భాగ్యనగర గుండెకాయ వంటి మూసీ నది పునరుజ్జీవన దిశగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన బృహత్తర ప్రణాళికలకు న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయి. ప్రతిష్ఠాత్మకమైన గాంధీ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను జాతీయ హరిత ట్రిబ్యునల్ కొట్టివేస్తూ కీలక తీర్పునిచ్చింది. దీంతో మూసీ ప్రక్షాళనతో పాటు బాపూఘాట్ పరిసరాల్లో అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రాన్ని నిర్మించాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పానికి గ్రీన్ సిగ్నల్ లభించినట్లయింది. ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు చేస్తున్న పోరాటాల మధ్య ఈ తీర్పు అధికార పక్షానికి కొండంత అండగా నిలిచింది. పర్యావరణ పరిరక్షణ ముసుగులో అభివృద్ధిని అడ్డుకోలేమని ట్రిబ్యునల్ స్పష్టం చేయడంతో ప్రాజెక్టు పనులు ఇక వేగవంతం కానున్నాయి. ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ నేత పటోళ్ల కార్తీక్ రెడ్డి ఎన్జీటీలో పిటిషన్ దాఖలు చేశారు. గాంధీ సరోవర్ నిర్మాణం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, స్థానిక నివాసితులకు ఇబ్బందులు ఎదురవుతాయని ఆయన తన వాదనలను వినిపించారు. అయితే ఈ వాదనలను నిశితంగా పరిశీలించిన ట్రిబ్యునల్ బెంచ్.. పిటిషనర్ సమర్పించిన వివరాల్లో స్పష్టత లేదని అభిప్రాయపడింది. ప్రాజెక్టు వల్ల పర్యావరణ ఉల్లంఘనలు జరుగుతున్నాయని నిరూపించడంలో పిటిషనర్ విఫలమయ్యారని పేర్కొంది. కేవలం అనుమానాలు, ఊహల ఆధారంగా ఒక భారీ ప్రభుత్వ ప్రాజెక్టును నిలిపివేయడం సాధ్యం కాదని తేల్చిచెప్పింది. శాస్త్రీయ ఆధారాలు లేకుండా వేసిన ఈ పిటిషన్ విచారణార్హం కాదని భావిస్తూ ధర్మాసనం దీనిని తోసిపుచ్చింది. మూసీ, ఈసా నదుల పవిత్ర సంగమ ప్రాంతమైన బాపూఘాట్ వద్ద గాంధీ సరోవర్‌ను నిర్మించాలని ప్రభుత్వం ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రస్తుతం ఉన్న 60 ఎకరాల బాపూఘాట్ ప్రాంగణాన్ని ఏకంగా 200 ఎకరాలకు విస్తరించి, అక్కడ ప్రపంచస్థాయి పర్యాటక హబ్‌ను రూపొందించనున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 123 అడుగుల ఎత్తయిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. విగ్రహం కింద సుమారు 100 మీటర్ల ఎత్తుతో ఒక భారీ టవర్‌ను నిర్మించి, అందులో వివిధ విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. గాంధీజీ బోధనలు, ఆయన జీవిత విశేషాలను ప్రతిబింబించేలా ఈ నిర్మాణం సాగనుంది. పర్యాటకులు ఈ టవర్ పైనుంచి మొత్తం హైదరాబాద్ మహానగరాన్ని వీక్షించేలా ప్రత్యేక వ్యూయింగ్ ప్లాట్‌ఫాంలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గాంధీ సరోవర్ కేవలం ఒక పర్యాటక కేంద్రంగానే కాకుండా విజ్ఞాన గనిగా విరాజిల్లనుంది. ఇక్కడ ఏర్పాటు చేయబోయే ఎడ్యుకేషన్ అండ్ నాలెడ్జ్ హబ్ ద్వారా విద్యార్థులకు, పరిశోధకులకు ఎంతో మేలు చేకూరనుంది. చేనేత రంగానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేక హ్యాండ్లూమ్ శిక్షణ కేంద్రాన్ని కూడా ప్రభుత్వం ప్రతిపాదించింది. బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం, స్వదేశీ నైపుణ్యాలను ప్రతిబింబించేలా ఈ కేంద్రం పని చేయనుంది. వీటితో పాటు మెడిటేషన్ అండ్ వెల్నెస్ విలేజ్ పేరుతో ఆధ్యాత్మిక కేంద్రాలను కూడా ప్రాజెక్టులో భాగం చేశారు. నగర జీవన ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు వీలుగా పచ్చని ప్రకృతి ఒడిలో ధ్యాన కేంద్రాలను రూపొందించబోతున్నారు. సాంస్కృతిక ప్రదర్శనల కోసం ప్రత్యేక వేదికలను సిద్ధం చేయనున్నారు. ఈ ప్రాజెక్టులో జాతీయ స్థాయి మ్యూజియం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. గాంధీజీ వినియోగించిన వస్తువులు, చారిత్రక ఘట్టాల ప్రదర్శనతో పాటు భారత స్వాతంత్ర్య పోరాట విశేషాలను ఇక్కడ పొందుపరుస్తారు. పరిశోధనా కేంద్రాల ద్వారా గాంధేయవాదంపై అధ్యయనం చేసే వారికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించనుంది. బాపూఘాట్ ప్రాశస్త్యాన్ని పెంచుతూనే మూసీ పరివాహక ప్రాంతాన్ని సుందరీకరించడం ఈ ప్రాజెక్టు అంతిమ లక్ష్యం. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంచిరేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయానికి శంకుస్థాపన చేసి మూసీ పునరుజ్జీవన పనులకు శ్రీకారం చుట్టారు. ఆధ్యాత్మికతను, ఆధునికతను జోడిస్తూ నది ఒడ్డున పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. రాజకీయంగా ఈ ప్రాజెక్టుపై గత కొంతకాలంగా దుమారం రేగుతోంది. స్థానిక నివాసితులు తమ ఇళ్లను కోల్పోతామని ఆందోళన చెందుతుండగా, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ వారికి మద్దతుగా నిలుస్తోంది. బాధితుల పక్షాన పోరాడుతామని ప్రకటించిన గులాబీ దళం, ఈ ప్రాజెక్టును అడ్డుకునేందుకు న్యాయపోరాటం చేస్తోంది. పర్యావరణ అనుమతులు లేకుండా పనులు ఎలా ప్రారంభిస్తారని పిటిషనర్ కార్తీక్ రెడ్డి నిలదీశారు. ప్రాజెక్టు డిజైన్ల విషయంలో కూడా అనేక అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అయితే ప్రభుత్వం మాత్రం ఇది కేవలం అభివృద్ధి నిరోధక చర్యేనని కొట్టిపారేసింది. నగర భవిష్యత్తు కోసం మూసీ ప్రక్షాళన అనివార్యమని, దీనివల్ల ప్రజలకు మేలే జరుగుతుందని సర్కార్ స్పష్టం చేసింది. ఎన్జీటీ తీర్పుతో ప్రభుత్వానికి పెద్ద ఊరట లభించినట్లయింది. పిటిషనర్ ఎటువంటి సాంకేతిక వివరాలు సమర్పించలేదని ట్రిబ్యునల్ వ్యాఖ్యానించడం గమనార్హం. పర్యావరణ ప్రభావాన్ని అంచనా వేయకుండానే ఆరోపణలు చేయడం సరికాదని న్యాయస్థానం భావించింది. ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులో పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించినట్లు ఆధారాలు లేవని తేల్చిచెప్పింది. బాపూఘాట్ వద్ద ప్రతిపాదించిన పనులు నిబంధనల ప్రకారమే సాగుతున్నాయని భావించి స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ పరిణామంతో అధికారులు ఇప్పుడు గాంధీ సరోవర్ పనులపై దృష్టి సారించనున్నారు. భూ సేకరణతో పాటు ఇతర పరిపాలనా పరమైన అనుమతులను త్వరితగతిన పూర్తి చేయాలని యోచిస్తున్నారు. నగరంలో పర్యాటక రంగానికి గాంధీ సరోవర్ ఒక కొత్త చిరునామాగా మారుతుందని పర్యాటక శాఖ అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ తరహాలో ఈ విగ్రహం కూడా భాగ్యనగరానికి ఐకాన్‌గా నిలుస్తుందని ఆశిస్తున్నారు. సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో ఆహ్లాదకరమైన పార్కులు, జలాశయాలను ఏర్పాటు చేయడం వల్ల నగర వాతావరణంలో సానుకూల మార్పులు వస్తాయని అంచనా వేస్తున్నారు. కేవలం వినోదం కోసమే కాకుండా పబ్లిక్ రిక్రియేషన్ ప్రాంతాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. నగరానికి వచ్చే అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా ఇక్కడ మౌలిక సదుపాయాలను మెరుగుపరచనున్నారు. మెట్రో రైలు కనెక్టివిటీని కూడా ఈ ప్రాంతానికి విస్తరించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ ప్రాజెక్టును పర్యవేక్షిస్తున్నారు. మూసీ ప్రక్షాళన పనుల్లో ఎలాంటి జాప్యం జరగకూడదని అధికారులను ఆదేశించారు. బాపూఘాట్ చుట్టుపక్కల ఉన్న ఆక్రమణలను తొలగించి, నదిని పూర్వ వైభవానికి తీసుకురావాలని ప్రభుత్వం పట్టుదలతో ఉంది. మూసీ నీటిని శుద్ధి చేయడం ద్వారా పర్యాటక ప్రాంతాల్లో దుర్వాసన లేకుండా చర్యలు తీసుకోనున్నారు. మురుగునీరు నదిలోకి చేరకుండా భారీ ఎస్టీపీలను నిర్మించే పనులు కూడా సమాంతరంగా సాగుతున్నాయి.

# ఫ్యూచర్ సిటీ పనుల్లో వేగం పెంచాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్ర రాజధాని శివార్లలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీ నిర్మాణ పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేరళ పర్యటన ముగించుకుని గురువారం హైదరాబాద్ చేరుకున్న వెంటనే ఆయన నేరుగా రంగారెడ్డి జిల్లాలోని మీర్‌ఖాన్‌పేట్‌కు చేరుకున్నారు. అక్కడ కొనసాగుతున్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయ భవన నిర్మాణ పనులతో పాటు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టులు నిర్ణీత గడువులోగా పూర్తి కావాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాల కల్పనలో రాజీ పడకూడదని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతేడాది సెప్టెంబర్‌లో మీర్‌ఖాన్‌పేట్ పరిధిలో సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. దాదాపు 19 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న ఈ కార్యాలయ భవన సముదాయం ఫ్యూచర్ సిటీ పరిపాలన విభాగాలకు కేంద్ర బిందువుగా మారనుంది. ప్రస్తుతం జరుగుతున్న సివిల్ పనుల నాణ్యతను ముఖ్యమంత్రి స్వయంగా తనిఖీ చేశారు. భవన నిర్మాణం శరవేగంగా పూర్తి చేసి వీలైనంత త్వరగా కార్యకలాపాలు ప్రారంభించాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. రాజధాని నగర విస్తరణలో భాగంగా ఈ అథారిటీ కీలక పాత్ర పోషించబోతోందని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. సమీప భవిష్యత్తులో ఈ ప్రాంతం ఆర్థిక వ్యవస్థకు ఊతం ఇచ్చేలా అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ భవన నిర్మాణ పనులపై ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ఆరా తీశారు. రాష్ట్రంలోని యువతకు అంతర్జాతీయ స్థాయి



నైపుణ్యాలను అందించడమే లక్ష్యంగా ఈ విశ్వవిద్యాలయాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. యూనివర్సిటీ ప్రాంగణంలో అకాడమిక్ బ్లాకులు, హాస్టల్ సదుపాయాలు ఇతర వసతుల కల్పనపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ఈ నైపుణ్యాల విశ్వవిద్యాలయం ఒక వారధిలా పనిచేస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పనుల పర్యవేక్షణలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. నిర్మాణ దశలో ఉన్న భవనాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో ఎఫ్.సి.డి.ఏ కార్యాలయం పునాది వంటిదని ముఖ్యమంత్రి అభివర్ణించారు. పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేస్తున్న ఈ కార్యాలయం అన్ని రకాల డిజిటల్ వసతులతో కూడి ఉండాలని కోరారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా అలసత్వం వహించకూడదని కాంట్రాక్ట్ ఏజెన్సీలను హెచ్చరించారు. జిల్లా యంత్రాంగం ప్రతి వారం పనుల పురోగతిపై నివేదికలు పంపాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి వెంట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇతర ఉన్నతాధికారులు ఉండి ప్రాజెక్టు మ్యాపుల ద్వారా పనుల వివరాలను తెలియజేశారు. వచ్చే కొన్ని నెలల్లో ఈ ప్రాంతం రూపరేఖలు మారిపోతాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. నిధుల విడుదల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి స్కిల్స్ యూనివర్సిటీకి సంబంధించిన డిజైన్లను పరిశీలించారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందించేలా ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. పర్యావరణ హితంగా భవన నిర్మాణాలు ఉండాలని పచ్చదనానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. విశ్వవిద్యాలయం ప్రారంభమైతే రాష్ట్రానికి పెట్టుబడులు కూడా భారీగా వచ్చే అవకాశం ఉందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# తెలంగాణ గొంతు కోస్తారా?

**మొదటిపేజీ తరువాయి**

ఉందని ఆయన ఆరోపించారు. రాజ్యసభ వేదికగా కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని మండిపడ్డారు. విభజన చట్టంలోనే ఈ ఏడు మండలాల అంశం ఉందని చెప్పడం పచ్చి అబద్ధమని, ఇది కేవలం రాజకీయ స్వార్థం కోసమే చేస్తున్న తప్పుడు ప్రచారమని హరీశ్‌రావు కొట్టిపారేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాజీనామా చేయకుండా పారిపోయిన చరిత్ర ఉన్న వ్యక్తి నేడు పార్లమెంట్‌లో నీతులు చెప్పడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. ఆనాడు ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసినప్పుడు కేసీఆర్ పిలుపునిచ్చిన తెలంగాణ బంద్‌ను కిషన్‌రెడ్డి విస్మరించారని హరీశ్‌రావు గుర్తుచేశారు. అప్పట్లో జరిగిన అన్యాయాన్ని ఎండగట్టిన విషయాలను దాచిపెట్టి, ఇప్పుడు ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంట అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న అసత్య ప్రచారాన్నే కిషన్‌రెడ్డి కూడా పార్లమెంట్‌లో వల్లెవేయడం చూస్తుంటే కాంగ్రెస్, బీజేపీల మధ్య ఉన్న చీకటి పొత్తు స్పష్టమవుతోందని విశ్లేషించారు. ఈ రెండు పార్టీలు కలిసి తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి కోట్లాది ఎకరాలకు నీరందిస్తుంటే, దానిపై విషం చిమ్మడం కిషన్‌రెడ్డి వికృత మనస్తత్వానికి నిదర్శనమని దుయ్యబట్టారు. సముద్ర మట్టానికి 148 మీటర్ల దిగువన ఉన్న గోదావరి జలాలను 618 మీటర్ల ఎత్తుకు తరలించి తెలంగాణ బీడు భూములను సస్యశ్యామలం చేయడం అబద్ధమా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ప్రస్తుతం కడుతున్న కాళేశ్వరం కాలువల్లో మండుటెండల్లో సైతం జలాలు పారుతున్నాయని, అది కళ్లకు కనిపిస్తున్న సత్యమని స్పష్టం చేశారు. సాగు నీటి ప్రవాహాన్ని చూసేందుకు కిషన్‌రెడ్డికి దమ్ముంటే రావాలని, తానే స్వయంగా



ప్రాజెక్టు క్షేత్రానికి తీసుకువెళ్తానని సవాలు విసిరారు. ఏ ప్రభుత్వమైనా ప్రజల సొమ్ముతోనే నిర్మాణాలు చేపడుతుందని, కేసీఆర్ తన జేబులోంచి ఖర్చు చేశారా అని అడగడం కిషన్‌రెడ్డి అవివేకానికి పరాకాష్ట అని ఎద్దేవా చేశారు. బీజేపీ ప్రభుత్వం నిర్మిస్తున్న జాతీయ రహదారులకు సొంత జేబుల్లోంచి నిధులు ఇస్తున్నారా అని నిలదీశారు. గతంలో కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీతో పాటు కేంద్ర జల సంఘం అధికారులు సైతం కాళేశ్వరం ప్రాజెక్టును ప్రశంసించారని హరీశ్‌రావు గుర్తుచేశారు. వారి ప్రశంసలు అబద్ధమంటారా లేక కిషన్‌రెడ్డి చెప్పే మాటలు అబద్ధమంటారా అని ప్రశ్నించారు. ఈ ఏడాదే కేంద్రం విడుదల చేసిన 'ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా' నివేదికలో తెలంగాణ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారని తెలిపారు. 2014లో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు భూమి, 2023 నాటికి 2.2 కోట్ల ఎకరాలకు చేరడం వెనుక కాళేశ్వరం, మిషన్ కాకతీయ కృషి ఉందని కేంద్రమే ఒప్పుకుందని వివరించారు. ఈ వాస్తవాలు కిషన్‌రెడ్డికి కనిపించడం లేదని, కేవలం రాజకీయ కక్షతోనే ప్రాజెక్టును బద్నాం చేస్తున్నారని మండిపడ్డారు.

తెలంగాణ ఎంపీ సురేశ్‌రెడ్డి రాజ్యసభలో ఎంతో బాధ్యతగా రాష్ట్రానికి రావాల్సిన నిధులు, విభజన హామీల గురించి మాట్లాడితే, దానికి మద్దతు ఇవ్వాల్సిన కేంద్ర మంత్రి అడ్డగోలుగా మాట్లాడటం దారుణమని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం గొంతు విప్పాల్సిన కిషన్‌రెడ్డి, తన బాధ్యతను విస్మరించి వ్యర్థ ప్రసంగాలు చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ వాదాన్ని పార్లమెంట్‌లో బలంగా వినిపించాల్సిన ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలు మౌనంగా ఉండి రాష్ట్ర గొంతును నొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది తెలంగాణ ప్రజలకు చేస్తున్న తీరని ద్రోహమని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని హెచ్చరించారు. కాళేశ్వరం వల్ల ఫలితం లేదని చెబుతున్న కిషన్‌రెడ్డి, అవే జలాలు నేడు రైతులకు ఎలా అందుతున్నాయో సమాధానం చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రైతుల పొలాల్లో పారుతున్న ప్రతి చుక్క నీరు కేసీఆర్ దార్శనికతకు నిదర్శనమని కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన భారీ ప్రాజెక్టుల వల్ల రాష్ట్రం అన్నపూర్ణగా మారిందని, దీనిని అగౌరవపరచడం అంటే తెలంగాణ రైతాంగాన్ని అవమానించడమేనని అన్నారు. కిషన్‌రెడ్డి తన పదవిని కాపాడుకోవడానికి ఢిల్లీ పెద్దల మెప్పు కోసం రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రజల పక్షాన బీఆర్ఎస్ ఎప్పుడూ పోరాడుతుందని, అబద్ధాలతో చరిత్రను వక్రీకరిస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని అంశాలను సవరించడం ద్వారా తెలంగాణకు చేసిన గాయం ఇంకా మానలేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఏడు మండలాల విలీనం వల్ల సీలేరు జలవిద్యుత్ కేంద్రం వంటి కీలక ఆస్తులను రాష్ట్రం కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుడు జరిగిన అన్యాయాన్ని సమర్థిస్తూ ఇప్పుడు మాట్లాడటం దుర్మార్గమని విమర్శించారు. కిషన్‌రెడ్డి పార్లమెంట్‌లో చేసిన ప్రసంగం మొత్తం అవాస్తవాల పుట్ట అని, అది కేవలం రాజకీయ ప్రేరేపితమని కొట్టిపారేశారు. తెలంగాణ బిడ్డగా ఉండి రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే చప్పట్లు కొట్టడం కిషన్‌రెడ్డికే చెల్లిందని మండిపడ్డారు. ఇకనైనా తప్పుడు ప్రచారాలు ఆపి, రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. కాంగ్రెస్, బీజేపీలు కలిసి తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నాయని హరీశ్‌రావు ఆరోపించారు. రేవంత్‌రెడ్డి మాటలకు కిషన్‌రెడ్డి వాయిస్ ఇస్తున్నారని, ఇది వారి మధ్య ఉన్న అంతర్గత అవగాహనకు నిదర్శనమని విశ్లేషించారు. కాళేశ్వరం ప్రాజెక్టును విఫలం చేసేందుకు జరుగుతున్న కుట్రలను ప్రజలు తిప్పికొడతారని ధీమా వ్యక్తం చేశారు. సాగునీటి రంగంలో తెలంగాణ సాధించిన పురోగతిని ప్రపంచం మెచ్చుకుంటుంటే, కిషన్‌రెడ్డి మాత్రం విమర్శలకు పరిమితం కావడం శోచనీయమని అన్నారు. ఇప్పటికైనా వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని, లేదంటే ప్రజలు సరైన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. నిధులు, నీళ్లు, నియామకాల ప్రాతిపదికన ఏర్పడిన తెలంగాణలో నీళ్ల విషయంలో జరిగిన అన్యాయాన్ని కేసీఆర్ సరిదిద్దారని హరీశ్‌రావు కొనియాడారు. కోటి ఎకరాల మాగాణి లక్ష్యంతో నిర్మించిన ప్రాజెక్టులను విమర్శించే నైతిక హక్కు కిషన్‌రెడ్డికి లేదని స్పష్టం చేశారు. కేంద్రంలో మంత్రిగా ఉండి రాష్ట్రానికి ఒక్క రూపాయి నిధులు తీసుకురాలేని వ్యక్తి, సాగునీటి ప్రాజెక్టులపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ప్రతిపక్షాల కుట్రలను క్షేత్రస్థాయిలో ఎండగడతామని ప్రకటించారు. కిషన్‌రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## బంచరాయితండలో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక సభ

### సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు వెల్లడించిన అధికారులు




**కురవి, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బంచరాయితండ గ్రామ పంచాయతీలో గురువారం ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక సభ ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి యాకూబ్ పాషా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) శిరీష హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యలు, లబ్ధిదారుల వివరాలపై సభలో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఏఈఓ శిరీష మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు గ్రామీణ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం కావడానికి ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక సభలు గ్రామ స్థాయిలో ప్రభుత్వ పనితీరును ప్రజలకు చేరవేసే వేదికలుగా నిలుస్తున్నాయని ఆమె అభిప్రాయపడ్డారు. అనంతరం సభను ఉద్దేశించి సర్పంచ్ బాధవత్ కమ్లి పుల్య, ఉపసర్పంచ్ కల్పన భరత్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల గ్రామంలోని పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు గణనీయమైన లబ్ధి చేకూరుతోందని తెలిపారు. గ్రామ ప్రజలు అందరూ ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామ అభివృద్ధిలో ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని సూచించారు. సభలో భాగంగా "ప్రజాపాలన - మన గ్రామ ప్రగతి నివేదిక" ను గ్రామ ప్రజల ముందుంచి ఇప్పటివరకు గ్రామంలో అమలైన పథకాల లబ్ధిదారుల వివరాలను వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా గ్రామంలో మొత్తం 13 మంది లబ్ధిదారులు ఎంపిక కాగా, అందులో 8 ఇండ్లు పూర్తయ్యాయి, 5 ఇండ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. 34 కుటుంబాలు కొత్తగా తెల్ల రేషన్ కార్డులు పొందినట్లు అధికారులు తెలిపారు. వ్యవసాయ రంగంలో ప్రభుత్వం అందిస్తున్న మద్దతు కింద 180 మంది రైతులు రుణమాఫీ పథకం ద్వారా లబ్ధి పొందగా, 250 మంది రైతులు రైతు భరోసా పథకం కింద ప్రయోజనం పొందినట్లు వెల్లడించారు. అలాగే 79 కుటుంబాలు గృహ జ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్ సదుపాయం పొందుతున్నాయని, 101 మంది చేయూత పెన్షన్లు అందుకుంటున్నారని తెలిపారు. గ్రామంలోని వృద్ధులు, వికలాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న పించన్లు ఎంతో ఉపశమనం కలిగిస్తున్నాయని సభలో పేర్కొన్నారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా గ్రామంలోని 24 స్వయం సహాయక సంఘాలు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.69 లక్షల 679 వరకు లబ్ధి పొందినట్లు వివరించారు. అదేవిధంగా 24 మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు కూడా అందించినట్లు వెల్లడించారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ఈ పథకాలు ఎంతో దోహదపడుతున్నాయని సభలో అభిప్రాయపడ్డారు. అలాగే గ్రామంలోని 296 మంది మహిళలు ఇందిరమ్మ చీరలు ఉచితంగా పొందినట్లు, 13 కుటుంబాలు కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా లబ్ధి పొందినట్లు వివరించారు.

# గ్రూప్1 అభ్యర్థులకు చుక్కెదురు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్1 నియామక ప్రక్రియపై నెలకొన్న న్యాయపరమైన ఉత్కంఠకు అత్యున్నత న్యాయస్థానం తెరదించింది. 2024 నోటిఫికేషన్ ద్వారా చేపట్టిన ఈ నియామకాల్లో అవకతవకలు జరిగాయంటూ దాఖలైన పిటిషన్లను విచారించిన సుప్రీంకోర్టు, ఈ వ్యవహారంలో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం ఈ మేరకు కీలక తీర్పును వెలువరించింది. గతంలో తెలంగాణ హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ, అభ్యర్థులు దాఖలు చేసిన అప్పీళ్లను ధర్మాసనం డిస్మిస్ చేసింది. దీంతో గ్రూప్1 నియామకాలపై ఇన్నాళ్లుగా కొనసాగుతున్న సందిగ్ధత పూర్తిగా తొలగిపోయింది. రాష్ట్రవ్యాప్తంగా 563 గ్రూప్1 పోస్టుల భర్తీ కోసం టీఎస్‌పీఎస్సీ చేపట్టిన ఎంపిక ప్రక్రియలో పారదర్శకత లోపించిందని కొందరు అభ్యర్థులు ఆరోపించారు. ముఖ్యంగా జవాబు పత్రాల మూల్యాంకన విధానంలో భారీ ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయని, అర్హులైన వారికి అన్యాయం జరిగిందని వారు వాదించారు. ఈ నియామకాలను రద్దు చేసి, కొత్తగా పరీక్షలు నిర్వహించాలని కోరుతూ అభ్యర్థులు తొలుత తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, సింగిల్ బెంచ్ విచారణ చేపట్టి నియామక ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేవని స్పష్టం చేస్తూ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ అభ్యర్థులు సుప్రీంకోర్టు మెట్లెక్కారు. సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా అభ్యర్థుల తరపు న్యాయవాదులు తమ వాదనలను బలంగా వినిపించారు. హైకోర్టు సింగిల్ బెంచ్ తమ వాదనలను కనీసం పరిగణనలోకి తీసుకోలేదని, మూల్యాంకనంలో జరిగిన పొరపాట్లను విస్మరించిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అక్రమాలు జరిగినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని, పరీక్షను రద్దు చేయడమే సరైన పరిష్కారమని కోరారు. పారదర్శకత లేని ఎంపిక ప్రక్రియ వల్ల కష్టపడి చదివిన అభ్యర్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ నియామకాలను నిలిపివేసి, ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. టీఎస్‌పీఎస్సీ తరపున సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి ధర్మాసనం ముందు వాస్తవాలను వివరించారు. గ్రూప్1 నియామక ప్రక్రియ అత్యంత కఠినమైన నిబంధనల మధ్య, మూడు దశల వడపోతతో జరిగిందని ఆయన స్పష్టం చేశారు. మూల్యాంకన ప్రక్రియలో ఎక్కడా మానవ ప్రమేయానికి



లేదా అక్రమాలకు తావులేకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించినట్లు తెలిపారు. ఒకవేళ ఏవైనా చిన్నపాటి పొరపాట్లు జరిగినా, మూడు స్థాయిల్లో జరిగే పరిశీలనలో అవి ఖచ్చితంగా వెలుగులోకి వస్తాయని వివరించారు. ఎంపికైన అభ్యర్థులందరూ ఇప్పటికే విధుల్లో చేరిపోయారని, వారు వివిధ జిల్లాల్లో శిక్షణ పొందుతున్నారని కోర్టుకు విన్నవించారు. ఇరు పక్షాల వాదనలు విన్న జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం, నియామక ప్రక్రియ ఇప్పటికే ముగిసిన విషయాన్ని ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంది. అభ్యర్థులు విధుల్లో చేరిన తర్వాత, ఆ ప్రక్రియను వెనక్కి తిప్పడం సాధ్యం కాదని అభిప్రాయపడింది. హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పు సహేతుకమని, అందులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని ధర్మాసనం తేల్చిచెప్పింది. నిరాధారమైన ఆరోపణలతో నియామకాలను అడ్డుకోవడం సరికాదని వ్యాఖ్యానించింది. దీంతో అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. సుప్రీంకోర్టు తీర్పుతో రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద ఊరట లభించినట్లయింది. ఈ తీర్పు వెలువడగానే గ్రూప్1కు ఎంపికైన అభ్యర్థుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. చాలా కాలంగా న్యాయ పోరాటాల వల్ల తమ భవిష్యత్తుపై నెలకొన్న ఆందోళన ఇప్పుడు తొలగిందని వారు పేర్కొంటున్నారు. మరోవైపు, పిటిషన్ వేసిన అభ్యర్థులు సుప్రీంకోర్టు నిర్ణయంతో నిరాశకు లోనయ్యారు. తమ వాదనలకు సరైన గుర్తింపు లభించలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరీక్షల నిర్వహణలో టీఎస్‌పీఎస్సీ పారదర్శకత పాటించి ఉంటే ఇలాంటి పరిస్థితులు వచ్చేవి కావని అభ్యర్థుల సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. భవిష్యత్తులో జరిగే నియామకాల్లోనైనా ఇలాంటి వివాదాలు తలెత్తకుండా చూడాలని వారు కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్1 నియామకాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పూర్తి చేసింది. పదేళ్ల తర్వాత జరిగిన ఈ నియామకాల ద్వారా పాలనలో కొత్త రక్తం వస్తుందని సర్కారు ఆశిస్తోంది. సుప్రీంకోర్టు తీర్పు ద్వారా ఎంపికైన 563 మంది అభ్యర్థుల ఉద్యోగాలకు పూర్తి భద్రత లభించింది. ప్రభుత్వం ఇప్పటికే వీరికి వివిధ శాఖల్లో పోస్టింగ్‌లు ఇచ్చి, విధుల్లో చేర్చుకుంది. ప్రస్తుతం వీరంతా క్షేత్రస్థాయిలో శిక్షణ పొందుతూ పాలనాపరమైన అంశాలను నేర్చుకుంటున్నారు. అత్యున్నత న్యాయస్థానం తీర్పుతో ఈ అధికారుల నియామకంపై ఉన్న ఆఖరి న్యాయపరమైన అడ్డంకి కూడా తొలగిపోయింది. టీఎస్‌పీఎస్సీ చరిత్రలో ఈ నియామక ప్రక్రియ ఒక ముఖ్య ఘట్టంగా నిలిచిపోనుంది. అనేక సవాళ్లు, ఆందోళనలు, న్యాయ పోరాటాల మధ్య ఈ నోటిఫికేషన్ కార్యరూపం దాల్చింది. నియామక సంస్థ తరపు న్యాయవాదులు కోర్టులో పక్కా ఆధారాలతో వాదనలు వినిపించడం వల్ల కేసు వీగిపోయింది. మూల్యాంకన ప్రక్రియపై ఉన్న అనుమానాలను కమిషన్ పటాపంచలు చేయగలిగింది. సుప్రీంకోర్టు తీర్పు పాఠం ద్వారా ఇతర పోటీ పరీక్షల నిర్వహణకు కూడా ఒక స్పష్టత వచ్చినట్లయింది. అభ్యర్థులు ఇకపై తమ దృష్టిని తదుపరి నోటిఫికేషన్లపై మళ్లించాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు సూచిస్తున్నారు. న్యాయస్థానం తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తన తదుపరి నియామకాలపై దృష్టిసారించింది. గ్రూప్ 1 వివాదం ముగియడంతో మిగిలిన గ్రూప్2, గ్రూప్3 పరీక్షల ఫలితాలు, నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని భావిస్తోంది. నిరుద్యోగుల్లో ఉన్న అసంతృప్తిని తొలగించేందుకు పారదర్శకమైన నియామక వ్యవస్థను బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి ఇప్పటికే అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో కోర్టు కేసులకు తావులేకుండా నోటిఫికేషన్ల రూపకల్పన ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. సుప్రీంకోర్టు తాజా తీర్పు ప్రభుత్వానికి కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఎప్పుడూ ఒక సున్నితమైన అంశంగానే ఉంటూ వస్తోంది. అభ్యర్థులు తమ హక్కుల కోసం కోర్టులను ఆశ్రయించడం సహజమే అయినా, అది నియామక ప్రక్రియను దీర్ఘకాలం నిలిపివేయడానికి కారణం కాకూడదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు తీర్పు ద్వారా నియామక సంస్థల బాధ్యత మరింత పెరిగింది. పారదర్శకత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా పరీక్షలు నిర్వహిస్తేనే ఇలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉంటాయి. అభ్యర్థులకు వ్యవస్థపై నమ్మకం కలిగించడమే నియామక సంస్థల ముందున్న అతిపెద్ద సవాల్‌గా కనిపిస్తోంది.

# ఖమ్మం ఏజెన్సీకి నిధులేవి!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఖమ్మం జిల్లా రాజకీయ ముఖచిత్రంలో ఇప్పుడు నిధుల పంపిణీ అంశం చిచ్చు రేపుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా పది నియోజకవర్గాలు ఉండగా, అందులో ఐదు భద్రాద్రి కొత్తగూడెం పరిధిలోకి, మరో ఐదు ఖమ్మం జిల్లా పరిధిలోకి వస్తాయి. రాష్ట్ర ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ముగ్గురు మంత్రులు ఖమ్మం జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహిస్తుండటంతో సహజంగానే ఆయా నియోజకవర్గాలకు ప్రాధాన్యత లభిస్తోంది. ఉప ముఖ్యమంత్రి మధిర నుంచి, మరో ఇద్దరు మంత్రులు పాలేరు, ఖమ్మం స్థానాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ తమ ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. అయితే ఇదే సమయంలో పొరుగునే ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని నియోజకవర్గాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయాయన్న ఆవేదన స్థానికుల్లో వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మధిర, పాలేరు, ఖమ్మం నియోజకవర్గాలు నిధులతో కళకళలాడుతున్నాయి. మధిర నియోజకవర్గానికి రహదారుల నిర్మాణం కోసం భారీగా రూ.596 కోట్లు కేటాయించగా, జవహర్ ఎత్తిపోతల పథకానికి మరో రూ.630 కోట్లు మంజూరు కావడం విశేషం. రాయపట్నం, మహాదేవపురం లిఫ్ట్ ఇరిగేషన్ పనులు యుద్ధప్రాతిపదికన సాగుతుండటంతో మధిర రూపురేఖలు మారిపోతున్నాయి. మధిరను ఒక ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఈ స్థాయి అభివృద్ధి తమ ప్రాంతాల్లో ఎందుకు జరగడం లేదని భద్రాద్రి జిల్లా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కేవలం మంత్రుల ప్రాతినిధ్యం ఉన్న ప్రాంతాలకే పెద్దపీట వేయడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. పాలేరు నియోజకవర్గంలోనూ అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుతో పాటు మున్నేరుపాలేరు లింక్ స్కీమ్ కోసం సుమారు రూ.600 కోట్లు వెచ్చిస్తున్నారు. ఖమ్మం నగరంలో మున్నేరుపై నిర్మిస్తున్న కేబుల్ బ్రిడ్జి, వరద రక్షణ గోడ వంటి పనుల కోసం దాదాపు రూ.1000 కోట్ల వరకు ప్రభుత్వం కేటాయించింది. ఇలా ఖమ్మం జిల్లాలోని మూడు ప్రధాన నియోజకవర్గాలకే వేల కోట్ల రూపాయల నిధులు మళ్లుతుండటంతో మిగిలిన ప్రాంతాలు వెనుకబడిపోతున్నా




యి. ఈ వివక్షపై ఇటీవల మునుగోడు ఎమ్మెల్యే సైతం బహిరంగంగానే స్పందించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మంత్రుల జిల్లా అయినప్పటికీ నిధుల పంపిణీలో సమతుల్యత లోపించిందని ఆయన అభిప్రాయపడ్డారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పినపాక, కొత్తగూడెం నియోజకవర్గాల పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. జిల్లా కేంద్రమైన కొత్తగూడెంను కార్పొరేషన్‌గా మార్చినప్పటికీ ఆ స్థాయికి తగ్గట్టుగా మౌలిక వసతుల కల్పన జరగలేదు. అభివృద్ధి పనులు అంతంత మాత్రంగానే ఉండటంతో స్థానిక ఎమ్మెల్యే కునంనేని సాంబశివరావు శాసనసభ వేదికగా తన నిరసనను వ్యక్తం చేశారు. నిధుల కోసం పదేపదే విన్నవించుకుంటున్నా ప్రభుత్వం నుంచి ఆశించిన స్పందన రావడం లేదని ఆయన ఆవేదన చెందారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని విమర్శలు వస్తున్నాయి. కేవలం పట్టణ ప్రాంతాలకే పరిమితమైన అభివృద్ధి అటవీ ప్రాంతాలకు చేరడం లేదన్నది వాస్తవం. ఏజెన్సీ ప్రాంతమైన పినపాక నియోజకవర్గం సమస్యల సుడిగుండంలో చిక్కుకుంది. సుమారు మూడు లక్షల జనాభా కలిగిన ఈ నియోజకవర్గంలో నేటికీ ఒక్క మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి కూడా అందుబాటులో లేదు. అత్యవసర వైద్యం కోసం స్థానికులు వందల కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. బైపాస్ రోడ్డు నిర్మాణం, రైల్వే స్టేషన్ ఆధునీకరణ వంటి డిమాండ్లు ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే ఉన్నాయి. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్వయంగా ముఖ్యమంత్రిని, సంబంధిత మంత్రులను కలిసి విన్నవించినా ఫలితం దక్కడం లేదు. శాశ్వత భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేక వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భద్రాచలానికి ఇటీవల రూ.351 కోట్లు మంజూరు చేయడం కొంత ఉపశమనాన్ని కలిగించినా, అది సరిపోదని భక్తులు, స్థానికులు భావిస్తున్నారు. పినపాకలోని ఏడు మండలాల ప్రజలు దశాబ్దాలుగా అభివృద్ధి కోసం ఎదురు చూస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అంతర్గత రోడ్ల పరిస్థితి దారుణంగా తయారైంది. రహదారుల అభివృద్ధికి నిధులు లేక ప్రయాణాలు నరకప్రాయంగా మారుతున్నాయి. ప్రభుత్వం ఒకే జిల్లాపై దృష్టి కేటాయించడం వల్ల ఉమ్మడి జిల్లాలోని మిగిలిన ఐదు నియోజకవర్గాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. నిధులన్నీ కేవలం మూడు నియోజకవర్గాలకే పరిమితం కావడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని మేధావులు హెచ్చరిస్తున్నారు. ఖమ్మం జిల్లా మంత్రులు తమ నియోజకవర్గాలపై చూపే శ్రద్ధలో కొంత భాగమైనా పక్క జిల్లాపై చూపాలని ప్రజలు కోరుతున్నారు. పినపాక, కొత్తగూడెం ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు ఉన్నా ప్రభుత్వం చొరవ చూపడం లేదు. నిరుద్యోగ సమస్య వేధిస్తున్నా ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల కల్పనపై దృష్టి పెట్టడం లేదు. గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలు పెంచడానికి ప్రత్యేక నిధులు అవసరమని స్థానికులు చెబుతున్నారు. పినపాకలో మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తేనే ఆ ప్రాంతం ఆర్థికంగా పుంజుకుంటుందని నిపుణులు సూచిస్తున్నారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ఆచరణలో అభివృద్ధి కనిపించాలని ప్రజలు వేడుకుంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అన్ని ప్రాంతాలను సమానంగా చూడాలని కొత్తగూడెం జిల్లా నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఖమ్మం మంత్రుల ప్రభావంతో నిధులన్నీ అటువైపే వెళ్తున్నాయని వారు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి జిల్లా అన్న భావన పోయి విభజిత జిల్లాల మధ్య దూరం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీ ప్రజల కష్టాలను గుర్తించి వెంటనే ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని కోరుతున్నారు. పినపాకలోని గిరిజన గూడాలకు కనీస వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేస్తున్నారు. రాజకీయ ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వాలని వారు కోరుతున్నారు. గత కొన్నేళ్లుగా పినపాక నియోజకవర్గంలో భూగర్భ డ్రైనేజీ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వర్షం వస్తే చాలు డ్రైనేజీ నీరు రోడ్లపైకి వస్తుందని, దీనివల్ల అంటువ్యాధులు ప్రబలుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. బైపాస్ రోడ్డు లేకపోవడం వల్ల పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది.

# భూభారతి పోర్టల్ సేవలు షురూ..!

**మొదటిపేజీ తరువాయి**

వెబ్‌సైట్ సేవలను ప్రజలకు అంకితం చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భూముల డిజిటల్ సర్వేను వేగవంతం చేయడం ద్వారా రైతులకు శాశ్వత భూ రక్ష కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్ వల్ల రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ మంత్రి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ధరణి వ్యవస్థలోని లోపాలను సరిదిద్దుతూ, ప్రజాస్వామ్యబద్ధమైన నూతన విధానాన్ని అమలులోకి తెచ్చామని ఆయన వెల్లడించారు. రైతులకు భరోసా కల్పించలేని ఏ వ్యవస్థ అయినా నిష్ప్రయోజనమని, అందుకే భూభారతి ద్వారా ప్రతి ఎకరాకు రక్షణ కల్పించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుందని వివరించారు. భూ యజమానులకు ఎటువంటి ఆందోళన లేకుండా, తమ భూమి హక్కులపై పూర్తి స్పష్టతనిచ్చేలా ఈ పోర్టల్‌ను తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. సాంకేతిక సమస్యల వల్ల ఏ ఒక్క రైతు కూడా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పకడ్బందీగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. భూభారతి పోర్టల్ అమలును క్షేత్రస్థాయిలో విజయవంతం చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే భారీ ఎత్తున కసరత్తు పూర్తి చేసింది. రికార్డుల నమోదు, సరిహద్దుల నిర్ధారణ ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక శిక్షణ పొందిన లైసెన్స్‌డ్ సర్వేయర్లను రంగంలోకి దించారు. అత్యాధునిక సర్వే పరికరాల ద్వారా భూమిని కొలిచి, డిజిటల్ మ్యాపింగ్ చేయనున్నారు. ఇందుకోసం ప్రతి మండలానికి సరిపడా రోవర్లను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ రోవర్ల సాయంతో భూమి అక్షాంశాలు, రేఖాంశాలను కచ్చితంగా గుర్తించి, యజమానికి చెందిన భూమి సరిహద్దులను శాశ్వతంగా రికార్డుల్లో భద్రపరుస్తారు. దీనివల్ల భవిష్యత్తులో సరిహద్దుల విషయంలో పక్క రైతులతో వచ్చే వివాదాలకు పూర్తిస్థాయిలో తెరపడనుంది. ప్రస్తుతానికి ఈ భారీ ప్రాజె



క్టును రాష్ట్రవ్యాప్తంగా ఐదు ఎంపిక చేసిన మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని నిర్ణయించారు. ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, రంగారెడ్డి జిల్లా ఆమనగల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో ప్రయోగాత్మకంగా ఈ సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ మండలాల్లో వచ్చే ఫలితాలను, ఎదురయ్యే సవాళ్లను విశ్లేషించి, అవసరమైన మార్పులు చేసిన అనంతరం రాష్ట్రమంతటా విస్తరించనున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియతో పాటు ప్రతి భూమికి ఒక మ్యాప్‌ను జత చేయడం ఈ విధానంలోని అతిపెద్ద ప్రత్యేకత. దీనివల్ల క్రయవిక్రయాలు జరిగినప్పుడు భూమి విస్తీర్ణంలో గానీ, సరిహద్దుల్లో గానీ ఎటువంటి మోసాలకు తావుండదని అధికారులు భావిస్తున్నారు. భూభారతి పోర్టల్ ద్వారా ప్రతి భూకమతానికి విశిష్టమైన 'భూదార్' నంబర్‌ను కేటాయించనున్నారు. ఆధార్ కార్డు మాదిరిగానే భూమికి కూడా ఒక గుర్తింపు సంఖ్య ఉండటం వల్ల ఆస్తి వివరాలను ఆన్‌లైన్‌లో సులభంగా ట్రాక్ చేయవచ్చు. ఈ నంబర్ ద్వారా భూమికి సంబంధించిన క్రయవిక్రయాల చరిత్ర, ప్రస్తుత యజమాని వివరాలు, బ్యాంకు రుణాలు వంటి అంశాలన్నీ ఒక్క క్లిక్‌తో తెలుసుకునే వీలుంటుంది. కేవలం కాగితాల్లోనే కాకుండా సాటిలైట్ చిత్రాల ఆధారంగా భూమి రికార్డులను అనుసంధానించడం వల్ల అక్రమ రిజిస్ట్రేషన్లను పూర్తిగా అరికట్టవచ్చని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములు, చెరువులు, అటవీ ప్రాంతాల ఆక్రమణలకు కూడా ఈ విధానం ద్వారా చెక్ పడనుంది. సాధారణంగా భూముల రీసర్వే అంటే ఏళ్ల తరబడి పట్టే ప్రక్రియ అని భయపడాల్సిన పనిలేదని, వేగవంతమైన సాంకేతికతను వాడుతున్నామని మంత్రి వివరించారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లు గ్రామాల్లో పర్యటించి రైతు సమక్షంలోనే కొలతలు తీస్తారు. స్థానిక రైతులు తమకున్న అభ్యంతరాలను అక్కడికక్కడే పరిష్కరించుకునేలా ఏర్పాట్లు చేశారు. భూభారతి పోర్టల్ ద్వారా జారీ చేసే పట్టాదారు పాస్ పుస్తకాల్లో కచ్చితమైన మ్యాప్ కూడా ముద్రించనున్నారు. ఇది కేవలం పట్టా మాత్రమే కాకుండా భూమికి సంబంధించిన ఒక కచ్చితమైన సర్టిఫికెట్‌గా పనిచేస్తుంది. దీనివల్ల రైతులకు బ్యాంకు రుణాలు పొందడం మరింత సులభతరం కానుంది. పారదర్శకత పెరగడం వల్ల రెవెన్యూ కార్యాలయాల్లో అవినీతికి ఆస్కారం ఉండదని ప్రభుత్వం ఆశిస్తోంది. గ్రామాల్లో సర్వే చేసే సమయంలో స్థానిక ప్రజల భాగస్వామ్యం చాలా ముఖ్యమని మంత్రి పిలుపునిచ్చారు. సర్వే నెంబర్ల వారీగా రికార్డులను క్రమబద్ధీకరించడం వల్ల వారసత్వంగా వచ్చే భూ పంపిణీ సమస్యలు కూడా త్వరగా పరిష్కారమవుతాయి. ఉమ్మడి ఆస్తుల పంపిణీ సమయంలో జరిగే చిన్న చిన్న పొరపాట్లు పెద్ద వివాదాలుగా మారకుండా ఉండేందుకు భూభారతి ఒక వారధిలా పనిచేస్తుందని మంత్రి తెలిపారు. రైతు పక్షపాతిగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగానే రెవెన్యూ చట్టాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చామని స్పష్టం చేశారు. కేవలం భూములనే కాకుండా గ్రామాల్లోని ఇళ్ల స్థలాలను కూడా భవిష్యత్తులో ఈ పరిధిలోకి తెచ్చే ఆలోచన ఉన్నట్లు సూచనప్రాయంగా తెలిపారు. మండలాల వారీగా ఏర్పాటు చేసే రోవర్లు అత్యంత శక్తివంతమైన జీపీఎస్ వ్యవస్థతో అనుసంధానమై ఉంటాయి. ఈ పరికరాల ద్వారా సేకరించిన డాటాను నేరుగా రాష్ట్రస్థాయి సర్వర్‌కు పంపిస్తారు. దీనివల్ల మధ్యలో ఎవరూ రికార్డులను ట్యాంపరింగ్ చేసే అవకాశం ఉండదు. డేటా భద్రత విషయంలో అత్యున్నత ప్రమాణాలను పాటిస్తున్నట్లు ఐటీ విభాగం అధికారులు వెల్లడించారు. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన ఐదు మండలాల్లో ఇప్పటికే కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఏదైనా సాంకేతిక సమస్య ఎదురైతే వెంటనే పరిష్కరించేలా నిపుణుల బృందాన్ని సిద్ధం చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్ ఆధారంగా పోర్టల్‌లో మరిన్ని కొత్త ఫీచర్లను జోడించనున్నారు. రెవెన్యూ యంత్రాంగంపై పనిభారాన్ని తగ్గించి, సేవల వేగాన్ని పెంచడమే లక్ష్యమని మంత్రి చెప్పారు. గతంలో సర్వేయర్ కోసం నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు లైసెన్స్‌డ్ సర్వేయర్ల వ్యవస్థ ద్వారా ఆ ఇబ్బందులు తొలగుతాయని వివరించారు.

# కాళేశ్వరంపై రాజ్యసభలో రగడ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



దేశ రాజధానిలోని ఎగువ సభలో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి చట్టబద్ధ బిల్లుపై చర్చ సందర్భంగా తెలుగు రాష్ట్రాల రాజకీయ సెగ రాజుకుంది. అమరావతి అంశంపై జరుగుతున్న చర్చలో భాగంగా తెలంగాణకు చెందిన బీఆర్ఎస్ ఎంపీ సురేశ్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. అమరావతికి మద్దతు తెలుపుతూనే తెలంగాణ ప్రాజెక్టుల అంశాన్ని సురేశ్ రెడ్డి ప్రస్తావించగా, దానికి కిషన్ రెడ్డి అంతే ధాటుగా బదులిచ్చారు. ఉమ్మడి రాష్ట్ర విభజన నాటి పరిణామాల నుంచి నేటి సాగునీటి ప్రాజెక్టుల వరకు ఇరువురు నేతలు పరస్పర ఆరోపణలతో సభను హోరెత్తించారు. ప్రధానంగా విభజన బిల్లుపై బీజేపీ అనుసరిస్తున్న తీరును సురేశ్ రెడ్డి తప్పుబట్టగా, తెలంగాణలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఆర్థిక అవకతవకలను కిషన్ రెడ్డి ఎండగట్టారు. రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంటులో జరిగిన పరిణామాలపై బీజేపీ అగ్రనాయకత్వం చేస్తున్న వ్యాఖ్యలను సురేశ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. తల్లిని చంపి బిడ్డను వేరు చేశారంటూ ప్రధాని మోదీ గతంలో చేసిన వ్యాఖ్యలను ఉద్దేశించి ఆయన మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీకి ఇప్పటికీ స్పష్టమైన వైఖరి లేదని, పదేపదే నెగెటివ్ కామెంట్లు చేయడం సరికాదని హితవు పలికారు. విభజన అనేది రాజ్యాంగబద్ధంగా జరిగిన ప్రక్రియ అని, దానిని అవమానించేలా మాట్లాడటం తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కించపరచడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ నేతలు ఇప్పటికైనా తమ ధోరణిని మార్చుకోవాలని, రాష్ట్ర ఏర్పాటుపై సానుకూల దృక్పథంతో ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. అమరావతి రాజధాని విషయంలో గతంలో కేసీఆర్ చూపిన చొరవను సురేశ్ రెడ్డి గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలని, తెలుగు సోదరులుగా కలిసి ఉందామని కేసీఆర్ ఆనాడే ఆకాంక్షించారని పేర్కొన్నారు. అమరావతి శంకుస్థాపన కార్యక్రమానికి స్వయంగా వెళ్లి మద్దతు తెలిపిన విషయాన్ని సభ దృష్టికి తెచ్చారు. రాష్ట్రాలు వేరైనా ప్రజల మధ్య అనుబంధం అలాగే ఉండాలని కేసీఆర్ కోరుకున్నారని కొనియాడారు. తెలంగాణను అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలిపిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందని సభలో గట్టిగా వినిపించారు. పరిపాలనాపరంగా తెలంగాణ ఒక రోల్ మోడల్ గా నిలిచిందని, అభివృద్ధి ఫలాలు ప్రతి పేదవాడికి అందేలా గత ప్రభుత్వం కృషి చేసిందని ఆయన వివరించారు. తెలంగాణకు చెందిన ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసిన తీరుపై సురేశ్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఆనాడు సభలో కనీసం చర్చ కూడా లేకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. భద్రాచలం పరిసర ప్రాంతాల ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోకుండా జిల్లాలను విడగొట్టడం విభజన చట్టానికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. కేంద్రం అప్పట్లో అనుసరించిన విధానం వల్ల స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. విభజన హామీల అమలులో కేంద్రం మొండిచేయి చూపిస్తోందని, తెలంగాణకు రావలసిన నిధులు, ప్రాజెక్టుల విషయంలో వివక్ష చూపుతోందని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తాము రాజీలేని పోరాటం చేస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై సురేశ్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేంద్రం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం అందకపోయినా కేసీఆర్ పట్టుదలతో ఈ భారీ ప్రాజెక్టును పూర్తి చేశారని చెప్పారు. కేవలం మూడు నాలుగేళ్లలోనే యుద్ధ ప్రాతిపదికన నిర్మాణం పూర్తి చేసి కోటి ఎకరాల మాగాణిగా తెలంగాణను మార్చారని కొనియాడారు. మేడిగడ్డ వద్ద రెండు పిల్లర్లు కుంగినంత మాత్రాన మొత్తం ప్రాజెక్టును వేస్ట్ అనడం రాజకీయ కుట్ర అని మండిపడ్డారు. చిన్న చిన్న సాంకేతిక లోపాలను సాకుగా చూపి లక్షల కోట్ల విలువైన ఆస్తులను నిరుపయోగం చేయాలని చూడటం సరికాదన్నారు. ప్రాజెక్టు వల్ల కలిగిన ప్రయోజనాలను విస్మరించి కేవలం బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ నేతలపై ఫైర్ అయ్యారు.

సురేశ్ రెడ్డి వ్యాఖ్యలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ధాటుగా కౌంటర్ ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఆశించిన ఫలితం లేదని కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఇప్పటికే తేల్చిచెప్పాయని వెల్లడించారు. నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికల్లో ప్రాజెక్టు లోపాలు స్పష్టంగా ఉన్నాయని చెప్పారు. మేడిగడ్డతో పాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సైతం తీవ్రమైన నిర్మాణ లోపాలు ఉన్నాయని ఇంజినీర్ల క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించారని వివరించారు. ఈ ప్రాజెక్టు కేవలం ప్రచారానికి తప్ప ప్రజల దాహార్తిని తీర్చడానికి ఉపయోగపడలేదని విమర్శించారు. శాస్త్రీయ అధ్యయనం లేకుండా నిధులను నీళ్లలా ఖర్చు చేశారని, దీనివల్ల రాష్ట్ర ఖజానాపై భారీ భారం పడిందని కిషన్ రెడ్డి సభలో ఎత్తిచూపారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి ఒక 'ఏటీఎం'లా మారిందని ఆరోపించారు. కాగ్ నివేదికలో సైతం ఆర్థిక నిర్వహణలోని లోపాలను, నిధుల మళ్లింపును స్పష్టంగా పేర్కొన్నారని గుర్తు చేశారు. ప్రాజెక్టు అంచనాలను అమాంతం పెంచి వేల కోట్లు కొల్లగొట్టారని విమర్శించారు. సాగునీటి పేరుతో జరిగిన ఈ దోపిడీపై పూర్తి స్థాయి విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసిన వారు ఎవరైనా సరే చట్టం ముందు నిలబడక తప్పదని హెచ్చరించారు. గత పదేళ్లలో జరిగిన పాలనలో పారదర్శకత లోపించిందని, కేవలం ఒక కుటుంబం ప్రయోజనాల కోసమే నిర్ణయాలు జరిగాయని ఆయన మండిపడ్డారు. తెలంగాణలో అధికార మార్పిడి తర్వాత జరుగుతున్న పరిణామాలపై కిషన్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ను జైలుకు పంపుతామని ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు ప్రగల్భాలు పలికారని గుర్తు చేశారు. అధికారం చేపట్టిన తర్వాత ఆ దిశగా ఎందుకు అడుగులు వేయడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం కుదిరిందని ఆరోపించారు. అవినీతిపై విచారణ జరిపితే తమ గుట్టు కూడా బయటపడుతుందనే భయంతో కాంగ్రెస్ వెనకాడుతోందని చెప్పారు. ఈ రెండు పార్టీలు ఒకే నాణేనికి ఉన్న రెండు పార్శ్వాలని, ప్రజలను మోసం చేయడంలో రెండూ సమానమేనని విమర్శించారు. లోపల తిట్టుకున్నా బయటకు మాత్రం మిత్రపక్షాల్లా వ్యవహరిస్తున్నాయని ఆయన ఎద్దేవా చేశారు.

## ప్రజా పాలనతోనే పేదల దరిద్రం దూరం

**సర్పంచ్ గండమల్ల స్వాతి, భాస్కర్**



**తిరుమలగిరి, విశాలభారతి :** తిరుమలగిరి మండలం తొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో '99 రోజుల ప్రజా పాలన ప్రగతి నివేదిక' సభను గురువారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ బోయపల్లి గండమల్ల స్వాతి భాస్కర్ అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అండగా మహిళా సాధికారత: కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తోంది. రైతుబంధు ద్వారా ఎకరాకు రూ. 6,000 పెట్టుబడి సాయం, సన్న రకం వడ్లకు బోనస్ అందిస్తూ అన్నదాతను ఆదుకుంటోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. గృహ జ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కల్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ ద్వారా రూ. 1,16,116 సాయం, కొత్త రేషన్ కార్డుల మంజూరుతో పాటు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ , ఎస్సై వెంకట్ రెడ్డి, మండల విద్యాధికారి శాంతయ్య, వ్యవసాయ అధికారి వెంకటరెడ్డి , లైన్మెన్ ఎలా గౌడ్ ,ఉపసర్పంచ్ వెంకన్న,వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రసాభసగా మారిన ప్రజా పాలనా గ్రామ సభ



**కోదాడ, విశాలభారతి:** మునగాల మండల పరిధిలోని తాద్వాయి గ్రామంలో గురువారం అధికారులు ఏర్పాటు చేసిన ప్రజాపాలన గ్రామ సభలు రసాభాసగా మారాయి. ఈ సందర్భంగా గ్రామసభలో గతంలో సంక్షేమ పథకాలకు అప్లై చేసుకున్న లబ్దిదారుల లిస్ట్ ను అధికారులు గ్రామస్తులకు చదివి వినిపించారు. దీంతో గ్రామస్తులు తమ పేర్లు రాలేదని అనర్హుల పేర్లు వచ్చాయని, భూస్వాములకే, ధనవంతులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వారి పేర్లు వస్తున్నాయని అధికారులను ప్రశ్నించడంతో గందరగోళం నెలకొన్నది. దీంతో అధికారులు అర్హులు ఎవరైనా ఉంటే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు సంక్షేమ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అంతేకాకుండా గ్రామ నాయకులు నచ్చ చెప్పే ప్రయత్నం చేశారు. అయినా వినకుండా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు గ్రామస్తులకు వాగ్వాదం చోటుచేసుకుంది. అధికారులు కొంత సేపు వీడియో గ్రాఫర్ లాగా అవతారం వేత్తి, గ్రామస్తులను వీడియోలు తీసుకుంటు గ్రామసభను అర్ధరాంతంగా ముగించేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు గ్రామ ఇన్చార్జి వసంత, గ్రామపంచాయతీ కార్యదర్శి రాము నాయక్, స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రామయ్య, గ్రామ సర్పంచ్ కొలిశెట్టి రాంబాయమ్మ, బుచ్చి పాపయ్య, వార్డ్ నెంబర్లు, జిల్లేపల్లి ఉష, మాలోతు లక్ష్మి, కందుల లింగయ్య, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లెపల్లి వినయ్, కోట దానియల్, ఆశ వర్కర్లు, గ్రామ పెద్దలు ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి



**మహబూబాబాద్, విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వర్తక సంఘ భవన్ లో ఘనంగా నిర్వహించిన ఐశ్వర్య - సందీప్ రెడ్డిల వివాహ వేడుకకు మాజీ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆమె వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతూ, వారి దాంపత్య జీవితం ఆనందమయం, ఆయురారోగ్యాలతో నిండి ఉండాలని ఆకాంక్షించారు. వివాహ వేడుక ఆత్మీయ వాతావరణంలో, బంధుమిత్రులు, ఆతిథులతో సందడిగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు వధూవరులను కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మాజీ జడ్పీ చైర్మన్ కుమారి అంగోత్ బిందు, వార్డ్ కౌన్సిలర్ పోతురాజు, రాజశేఖర్, బొడ శ్రీను నాయక్ తదితరులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కరించాలి



**కోదాడ, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్రంలో 90 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామ సభలు నిర్వహించడం అభినందనీయమని భవన నిర్మాణ కార్మికు జిల్లా కమిటీ సభ్యులు కోలా ఆంజనేయులు అన్నారు. గురువారం నాడు తాద్వాయి లో జరిగిన గ్రామ సభలో భవన నిర్మాల కార్మికుల సమస్యల గురించి గ్రామ ఇన్చార్జి ఆఫీసర్ పి. ఆర్.ఈ. వసంత కు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. జిల్లాలోని అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి, కార్మికులకు ఉపయోగపడని సిఎస్సి హెల్త్ టెస్టర్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలనీ ఆయన డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఇన్సూరెన్స్ సంస్థలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేసి, కార్మికులకు ప్రభుత్వ పరిరక్షణ కల్పించాలనీ, భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం చేసే జీవో నెం. 12 ను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిలివేరు రాంబాబు, ఎం. సైదులు, బి.ఉపేందర్, కోలా స్రవంతి, ఎన్. శ్రీను, ఏ. పుల్లమ్మ, కొండమీది. అంజయ్య, కే. సత్యం తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి ఘనంగా

**కలెక్టరేట్‌లో నివాళులర్పించిన అదనపు కలెక్టర్ అనిల్ కుమార్**



**మహబూబాబాద్ విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, ప్రజాస్వామ్య విలువలకు ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన పోరాటం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, జిల్లా క్రీడల అధికారి జ్యోతి ఓలేటి, వెంకటేశ్వర్లు, రవీందర్, అలాగే కలెక్టరేట్ లోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కి నివాళులు అర్పించారు.

## ట్రాక్టర్ డ్రైవర్ సర్పంచ్‌పై కేసు నమోదు

**దేవరుప్పుల, విశాలభారతి:** దేవరుప్పుల తహశీల్దార్ కు అందిన ఫిర్యాదు మేరకు చిన్నమడూరు గ్రామంలో అనుమతి లేకుండా ఇసుక రవాణా చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది వివరాల ప్రకారం మార్చి 30/3/ 2026 తేదీన మధ్యాహ్నం సుమారు రెండు గంటల ప్రాంతంలో గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా కంకటి శ్రీను అనే డ్రైవర్ ఎలాంటి అధికారిక అనుమతి లేకుండా చిన్నమడూరు వాగు నుంచి ఇసుకను తరలించినట్లు ఆరోపణలు వచ్చాయి, ఈ ఇసుక రవాణా చర్యను చిన్నమడూరు గ్రామ సర్పంచ్ మైదం జోగేశ్వర్ ఆదేశాల మేరకు చేపట్టినట్లు దరఖాస్తులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులకు ఫిర్యాదు అందడంతో కంకటి శీను మరియు సర్పంచ్ మైదం జోగేశ్వర్ పై చట్టరీత్యా చర్య తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు దేవరుప్పుల ఎస్ఐ ఊర స సృజన్ కుమార్ తెలిపారు. ఘటనపై పూర్తి వివరాలు సేకరించి సంబంధితులపై తగిన చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు వెల్లడించారు.

## గ్రామసభలో శుభ్రత సమస్యలపై చర్యలు కోరుతూ వినతి



**దేవరుప్పుల విశాలభారతి:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన 99 రోజుల కార్యక్రమంలో దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి గ్రామ సభలో గ్రామం యొక్క శుభ్రత పరిశుభ్రత సమస్యలను తీవ్రంగా ప్రస్తావించారు. గ్రామంలో రోజువారీగా వచ్చే చెత్త ట్రాక్టరు ఉన్నప్పటికీ కొంతమంది ప్రజలు చెత్తను అందులో వేయకుండా ఎక్కడపడితే అక్కడ పారవేస్తున్నారని, ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా సింగరాజుపల్లి నుంచి చిన్నమదూరు రుద్రమదేవి మహిళ మార్క్స్ ఖాళీ స్థలం పెద్దమదూరు వెళ్లే మార్గాల వద్ద ఉన్న కాలి స్థలాల్లో చెత్త వేయడం వల్ల నీరు కలుషితమవుతూ, దుర్వాసన వ్యాపిస్తుంది ఈ పరిస్థితి రహదారిల్లో వెళ్లే ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇదే సమయంలో రైతులకు సంబంధించిన సన్న రకాల భొనస్ నగదు ఇప్పటివరకు అందకపోవడంతో, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని, విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రభుత్వం ప్రకటించిన గ్యాస్ సబ్సిడీ ఇప్పటికీ లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ వెంటనే సబ్సిడీ జమ చేయాలనుకోరారు. గ్రామ అభివృద్ధి ప్రజల సంక్షేమం కోసం అధికార యంత్రాంగం స్పందించి సమస్యలను పరిష్కరించాలని, గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఏప్రిల్ 5న బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**ఘనంగా నిర్వహణకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు**



**మహబూబాబాద్, విశాలభారతి:** భారత మాజీ ఉపప్రధాని, దళిత వర్గాల ఆశాజ్యోతి, సమతావాది డా. బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలను ఈ నెల 5వ తేదీన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కమిషనర్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ, హైదరాబాద్ మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లాలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 5న ఉదయం 9 గంటలకు మహబూబాబాద్ రైల్వే స్టేషన్ మొదటి ప్లాట్ ఫాం సమీపంలో ఉన్న డా. బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పుష్పమాలంకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో ఉత్సవ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకలకు అన్ని కుల సంఘాలు, ఉద్యోగులు, అధికారులు, దళిత, గిరిజన, వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

## ఘనంగా హనుమాన్ జయంతి విజయోత్సవ ర్యాలీ

**చౌటుప్పల్, విశాలభారతి:** హనుమాన్ విజయోత్సవ ర్యాలీ సందర్భంగా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని పెరుమాళ్ల ఆంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం ఉదయం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆంజనేయ స్వామికి అభిషేక కార్యక్రమం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య భక్తి శ్రద్ధలతో జరిగింది. చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయ స్వామి ఆశీర్వాదంతో మున్సిపాలిటీ ప్రజలు సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాల తో ఉండాలని ఆమె ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలకవర్గ గౌరవ అధ్యక్షుడు ముత్యాల భూపాల్ రెడ్డి, అధ్యక్షుడు ఉప్పు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు అన్నమోని చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి పోలోజు శ్రీనివాస్, కోశాధికారి పోలోజు శ్రీనివాస్ చారి, సభ్యులు మండే మల్లేష్, కలకుంట్ల శివ, సుంకి రవి, కర్నాటి జనార్ధన్, పాలాది రఘుపతి, నామని వీరేశం, గుర్రం బాలరాజు, ఎక్కలదేవి శివ, గజ్జల రాజు, బిర్రు శ్రీహరి, సుంకి లావణ్య, స్వరూప,కాంగ్రెస్ పార్టీ నాయకులు పబ్బు శ్రీకాంత్, సుర్కంటి బాలకృష్ణారెడ్డి, దేవస్థానం పూజారి బొల్లోజు విష్ణు చారి, పాత్రికేయులు హనుమంత్ రెడ్డి, ఎర్రసాని సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక గ్రామసభలు

**జిల్లా వ్యాప్తంగా ప్రజల అభిప్రాయాలు, శాఖల ప్రగతి నివేదికల వెల్లడి.**

**మహబూబాబాద్, విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామసభలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ప్రజల భాగస్వామ్యంతో పాలనను మరింత పారదర్శకంగా, అభివృద్ధి దిశగా తీసుకెళ్లే లక్ష్యంతో ఈ సమావేశాలు నిర్వహించారు. దంతాలపల్లి మండల కేంద్రం, పెద్ద ముప్పారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణంలో నిర్వహించిన గ్రామ సభకు ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే గూడూరు మండల కేంద్రంలో జరిగిన గ్రామసభకు మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ పాల్గొన్నారు. ఇక ఇనుగుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభకు జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్ హాజరై కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అదేవిధంగా కేసముద్రం మున్సిపల్ కార్యాలయం, మరిపెడ మండల కేంద్రం తదితర ప్రాంతాల్లో కూడా అధికారులు గ్రామసభల్లో పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో తెలంగాణ రాష్ట్ర గీతం ఆలపించి సభను ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని ఎంపీడీవో వినిపించగా, గ్రామ పంచాయతీకి సంబంధించిన సమగ్ర ప్రగతి నివేదికను పంచాయతీ కార్యదర్శి సభలో వివరించారు. అలాగే గ్రామస్థాయిలో పనిచేస్తున్న వివిధ శాఖల సిబ్బంది తమ తమ విభాగాల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు స్థితి గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వివిధ సంక్షేమ పథకాల లబ్దిదారులు, గ్రామస్థులు తమ అభిప్రాయాలు, సూచనలు, సలహాలు వెల్లడించారు. గ్రామాభివృద్ధికి అవసరమైన అంశాలపై ప్రజల నుంచి వచ్చిన సూచనలను అధికారులు నమోదు చేసుకున్నారు. జిల్లాలోని 18 మండలాలు, 5 మున్సిపాలిటీలు, 482 గ్రామపంచాయతీలలో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని గ్రామస్థాయిలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలపై సమగ్ర నివేదికలను చదివి వినిపించారు. కొన్ని చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు, అభివృద్ధి పథకాల వీడియో సందేశాలు కూడా ప్రదర్శించారు. ఈ గ్రామసభల్లో మండల ప్రత్యేక అధికారులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, యువత, గ్రామస్తులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 6వ వార్డు సభ

- బేతోలులో సమస్యలపై ప్రజల ఆవేదన
- అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్

**మహబూబాబాద్, విశాలభారతి:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు బేతోలులో నేడు వార్డు సభ నిర్వహించారు. ఈ సభలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రాంత సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా 6వ వార్డు కౌన్సిలర్ భూక్య బుజ్జి రాంజీ మాట్లాడుతూ, వార్డులో వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి కోసం సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులు రూ.50 లక్షల అంచనాతో చేపట్టేందుకు ఈ ఏడాది జనవరి 13న శంకుస్థాపన జరిగినప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, మురళి నాయక్ శంకుస్థాపన చేసినా, కాంట్రాక్టు పనులు మొదలుకాకపోవడం ప్రజల్లో నిరాశ కలిగించిందన్నారు. వెంటనే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని వార్డు స్పెషల్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశారు. వార్డు సభలో ప్రజలు అనేక సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా భూదాన్ యజ్ఞం బోర్డు పరిధిలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని, ప్రభుత్వ భూములను రక్షించి, సర్వే చేసి, హద్దులు నిర్ణయించి, అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుపేదలకు భూములను పంచాలని డిమాండ్ చేశారు. అలాగే బతుకమ్మ ఘాట్‌కు ప్రత్యేక స్థలం లేకపోవడంతో, మహబూబాబాద్-మరిపెడ 365 జాతీయ రహదారిపై వేడుకలు నిర్వహించాల్సి వస్తోందని, దీనివల్ల ప్రమాదాల ముప్పు ఉందని మహిళలు తెలిపారు. మైసమ్మ కుంట వద్ద బతుకమ్మ ఘాట్ ఏర్పాటు చేయాలని కోరారు. ఇంకా, 6వ వార్డు బేతోలు ప్రాంతంలో 16 సంవత్సరాల క్రితం ప్రారంభమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ) భవనం ఇప్పటికీ పూర్తి కాలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పీహెచ్సీ ఒక ప్రైవేట్ భవనంలో నిర్వహిస్తున్నారని, అది కూడా శిధిలావస్థలో ఉండి ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ పీహెచ్సీ భవనాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ వార్డు సభలో వార్డు స్పెషల్ ఆఫీసర్ పవన్ చంద్ర, వార్డు ఆఫీసర్ మనోజ్, జీపీఓ రెవెన్యూ అధికారి హుస్సేన్, అర్జున్, ఆరోగ్య శాఖ అధికారులు దార వెంగళరావు, పోతు రాజు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ ప్రజలు షేక్ ఖాదర్ బాబా, గద్దపాటి సంతోష్, షేక్ యూసుఫ్, అనపర్తి మదన్, తూముల శ్రీధర్, నాగినేని ప్రభాకర్, ఏర్పుల హుస్సేన్, షేక్ జావిద్, ఏర్పుల రాజు, ఏనుగంటి వెంకన్న, జినుక ఎల్లయ్య పాల్గొన్నారు.



# ఘనంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభలు

- ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**మహబూబాబాద్, విశాలభారతి:**

ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా గురువారం దంతాలపల్లి మండల కేంద్రం, పెద్ద ముప్పారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణంలో నిర్వహించిన గ్రామసభకు ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసన సభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్, గూడూరు మండల కేంద్రంలో మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, ఇనుగుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభకు జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, కేసముద్రం మున్సిపల్ కార్యాలయం, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, మరిపెడ మండల కేంద్రాలలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర గీతం ఆలపించి గ్రామసభను ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని ఎంపీడీవో వినిపించగా, గ్రామ పంచాయతీ పూర్తి సమగ్ర నివేదికను పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థాయి అన్ని విభాగాల సిబ్బంది వారి వారి శాఖల ప్రగతి నివేదిక సభలో వివరించారు. ఈ సందర్భంగా వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులు తమ అభిప్రాయాలు, సూచనలు, సలహాలు వెల్లడించారు. జిల్లాలోనీ (18) మండలాలు, (5) మున్సిపాలిటీలు (98) వార్డుల ప్రత్యేక అధికారులు, (482), గ్రామపంచాయతీ కార్యాలయాలలో సర్పంచ్, గ్రామ పంచాయతీ సెక్రెటరీ, సంబంధిత అన్ని విభాగాల సిబ్బందితో కలిసి ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలు అభివృద్ధి పథకాల వీడియో సందేశం ద్వారా, క్షేత్రస్థాయిలో సమగ్ర నివేదికలు చదివి వినిపించి గ్రామసభలను నిర్వహించారు. ఇనుగుర్తి మండల కేంద్రం రైతు వేదికలో ఏర్పాటు చేసిన గ్రామసభకు ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ హాజరయ్యారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారి పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును క్షుణ్ణంగా వివరించారు. రైతు రుణ మాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సభ్యులకు మంజూరైన వడ్డీ లేని రుణాల వివరాలు, కొత్త రేషన్ కార్డులు, పాస్ బుక్కులు, సన్న బియ్యం పంపిణీ, వైద్య సేవలు, తదితర పథకాలకు సంబంధించి లబ్ధిదారుల పూర్తి వివరాలను గ్రామ ప్రజలకు తెలియజేశారు, నూతన పథకాలైన ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా, మధ్యాహ్న భోజన పథకం ఇంటర్మీడియట్ కు విస్తరణ, విభిన్న ప్రతిభావంత ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోటారు వాహనాలు, పంటల వైవిధ్యం, సహజ సేంద్రీయ వ్యవసాయం పథకాలపై అవగాహన కల్పించారు, ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో ప్రతి సమస్య పరిష్కారానికి బలమైన వేదిక గ్రామసభ అని అన్నారు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామ స్థాయిలోనే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు తెలిపారు తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రైతు భరోసా, గృహ జ్యోతి, మహాలక్ష్మి వంటి పథకాలు ప్రజలకు చేరేలా అధికారులు కృషి చేస్తున్నారని, అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకాల ప్రయోజనాలను పొందాలని సూచించారు. గ్రామ సభలో ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులు నమోదు చేసి త్వరిత గతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు, గ్రామ అభివృద్ధి కోసం ప్రజల భాగస్వామ్యం కీలకమని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, పిల్లల విద్యపై దృష్టి పెట్టడం, ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ వహించాలన్నారు, వాణిజ్య పంటల వైపు రైతులను ఆకర్షించాలని, ఆయిల్ ఫామ్, సాగు లాభదాయకంగా ఉందన్నారు, అంతర్ పంటల ద్వారా రైతులకు అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు, నానో యూరియా పై ప్రత్యేక దృష్టి పెట్టి క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్లు, వైస్ చైర్మన్లు, గ్రామపంచాయతీ సర్పంచులు, మండల ప్రత్యేక అధికారులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నల్ల పోచమ్మ ఆలయ నూతన కమిటీ ఎన్నిక



**ఆర్మూర్, విశాలభారతి:** నందిపేట్ మండలంలోని చింరాజ్ పల్లి గ్రామం లో గల నల్ల పోచమ్మ గుడి శివారు పల్గుట్ట వద్ద గల నల్ల పోచమ్మ గుడి కొరకు పవిత్ర హనుమాన్ జన్మోత్సవ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. పోచమ్మ ఆలయ చైర్మన్ గా తోట రవి, వైస్ చెర్మన్ గా నన్నం చిన్న సాయిలు, కోశాధికారి గా బెల్లుల చిన్న సాయిలు లను మరియు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా గురువారం ఎన్నుకోవడం జరిగింది. గ్రామానికి సంబందించిన భూములు అన్యాక్రాంతానికి గురి చేస్తూన్నందున ఇట్టి కమిటీ ని గ్రామస్తులు మరియు వీడీసీ పెద్దల నిర్ణయం తో ఏకగ్రీవం చెయ్యడం జరిగింది. చింరాజ్ పల్లి గ్రామానికి సంబందించిన భూమిని మా గ్రామ రైతులు సుమారు 2 ఎకరాల భూమిని నల్ల పోచమ్మ గుడి అభివృద్ధి కొరకు ఉచితంగా ఇవ్వడం జరిగింది. ఇతర గ్రామస్తులు ఈ ఆలయం పేరిట కమిటీలు గాని రాజకీయం చేస్తే తగదని సూచిస్తున్నాం. ఇట్టి కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తోట గణేష్ ఉప సర్పంచ్ తూర్పు నరేందర్ వీడీసీ సభ్యులు తోట దేవేందర్, తోట రాజు, కందెల చిన్న రాములు, తోట రాజన్న, దాసరి రాజన్న, కాషా రాఘవ, ఓరుగంటి చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో హనుమాన్ శోభాయాత్ర



**చౌటుప్పల్, విశాలభారతి:** మున్సిపాలిటీ లింగారెడ్డిగూడెం శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ శోభాయాత్ర భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హనుమాన్ ఉత్సవ విగ్రహానికి 1వ వార్డు కౌన్సిలర్ కొసనం రాకేష్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీ ఆంజనేయ స్వామి ఆశీర్వాదంతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. హనుమాన్ దేవస్థానం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర జై శ్రీరాం.. జై హనుమాన్ శరణుఘోషతో భక్తులు నృత్యాలు చేస్తూ గ్రామంలోని వీధుల గుండా శోభాయాత్ర అంగరంగ వైభవంగా కొనసాగింది. ఈ యొక్క శోభా యాత్ర కార్యక్రమంలో సుర్కంటి మహేందర్ రెడ్డి, ఏనాల రాజశేఖర్ రెడ్డి, సుర్కంటి కనకారెడ్డి, సుర్కంటి వెంకటరెడ్డి, పుష్కాగుల రమేష్ గౌడ్, తొర్పునూరి ఈశ్వర్ గౌడ్, తొర్పునూరి సురేష్ గౌడ్, నల్ల బాలరాజు యాదవ్, బొమ్మిరెడ్డి మధుసూదన్ రెడ్డి, చింతల శశికాంత్ రెడ్డి, బొమ్మిరెడ్డి నిఖిల్ రెడ్డి, తొర్పునూరి లింగ స్వామి, కొత్తమాసు శ్రీను, ఉష్కాగుల మురళి, తొర్పునూరి శ్రీను, సుర్కంటి యాదిరెడ్డి, పల్చం వెంకటేశం అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సారాయి తయారీకి బెల్లం అమ్మిన వ్యక్తికి రూ.50 వేల జరిమానా

- బైండోవర్ ఉల్లంఘన.. బెల్లం సరఫరాదారుడికి భారీ జరిమానా
- అక్రమ సారాయి నియంత్రణలో అధికారులు కఠిన చర్యలు




**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ మున్సిపాలిటీలోని కురవి గేటు ప్రాంతానికి చెందిన గరిపెల్లి నాగేశ్వరరావు పై సారాయి తయారీకి అవసరమైన బెల్లం, పటిక సరఫరా చేసిన కేసులో అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. గతంలో ఇదే నేరానికి సంబంధించి అతనిపై కేసు నమోదు చేసి, మహబూబాబాద్ తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు అధికారులు తెలిపారు. అయితే, బైండోవర్‌లో ఉన్నప్పటికీ అతను మళ్లీ సారాయి తయారీ కోసం బెల్లం సరఫరా/అమ్మకం చేయడంతో మరోసారి కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించినందుకు మహబూబాబాద్ తహసీల్దార్ అతనికి రూ.50,000 జరిమానా విధించారు. విధించిన జరిమానాను అతను ఈరోజు చెల్లించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా అధికారులు హెచ్చరిస్తూ, సారాయి తయారీకి బెల్లం, చక్కెర, పటిక వంటి పదార్థాలు సరఫరా చేసినా లేదా అమ్మినా చట్టప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో ముందుకెళ్లాలి

**కలెక్టర్ ఇలా త్రిపాఠి.. బీ.సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు**



**నిజామాబాద్, విశాలభారతి:** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోరాట యోధుడు పాపన్నగౌడ్ వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని గుర్తు చేశారు. అన్యాయాన్ని ఎదురించేందుకు సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆ మహనీయుని ఆశయాలకు అనుగుణంగా సామాన్యులకు ఫలాలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకునేలా చూడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, జిల్లా వెనుకబడిన తరగతుల సహాయ సంక్షేమ అధికారి సుజయ్, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి బుస్స ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## 39 వ డివిజన్‌లో పర్యటించిన ఎమ్మెల్యే మక్కన్ సింగ్



**విశాలభారతి, గోదావరిఖని:**

కాలువలపై వెలసిన అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని రామగుండం శాసన సభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆదేశించారు. వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా గురువారం రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామితో కలిసి 39 వ డివిజన్ శివాజీ నగర్ , కూరగాయల మార్కెట్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొందల గడ్డ గా మారిన రామగుండంను నవ నిర్మాణం చేస్తున్న క్రమంలో కాలువలు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా స్వచ్ఛ మైన నగరంగా రూపొందించడానికై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని పాలక వర్గం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని అన్నారు. వర్షాకాలంలోపు నగరం లోని అన్ని డ్రెయిన్ లలో పూడిక తొలగించాలని అన్నారు. ఇది నిరంతర ప్రక్రియ గా కొనసాగాలని అన్నారు. రామగుండం నగరం అభివృద్ధి చెందుతున్న క్రమంలో ప్రజలు వలస వెళ్లాల్సిన అవసరం లేదని అన్నారు. నగరం లోని మారుమూల నుండి సిటీ సెంటర్ వరకు 25 నిమిషాల్లో చేరుకునేలా రోడ్లన్నీ అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. సకల వసతులతో పాటు ఉపాధి అవకాశాలు కూడా పెంపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ గత పదేళ్లుగా కాలువల్లో పూడిక తొలగించకుండా పేరుకుపోయిన నేపథ్యంలో వర్షాకాలంలో వరదలు, అంటువ్యాధులు ప్రబలడం, దుర్వాసనతో కాలువల చుట్టు ప్రక్కల నివసిస్తున్న వారు ఇబ్బందులు పడుతుండడంతో ప్రధమ ప్రాధాన్యతగా కాలువలలో పూడిక తొలగింపు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నగరంలో అన్ని కాలువల్లో సంపూర్తిగా పూడిక తొలగించేవరకు ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని అన్నారు. మార్కెట్ ను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ముందే చెప్పినట్టుగా రెండు చెత్త డబ్బాలు ప్రతి దుకాణం ముందు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని అన్నారు.

ఈ సందర్భంగా కూరగాయల మార్కెట్ ప్రక్కన ఉన్న కాలువ లో పూడిక తొలగించడం తో పాటు ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్త తొలగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తిప్పారపు మానస, నాయకులు తిప్పారపు శ్రీనివాస్ తో పాటు పలువురు కార్పొరేటర్లు నగర పాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ నాయిని వెంకటస్వామి, ఎస్ ఇ గురువీర ఇ ఇ రామన్ , టి పి ఎస్ నవీన్, డి ఇ లు ,ఎ ఇ లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: జూపల్లి

**రేషన్ పాయింట్ ప్రారంభం**



**అశ్వారావుపేట, విశాలభారతి:**

అశ్వారావుపేట మున్సిపల్ పరిధిలోని 13వ వార్డ్ గుర్రాల చెరువు గ్రామంలో నిర్వహించిన గ్రామ సభ ఉత్సాహంగా జరిగింది. ఈ గ్రామ సభలో గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై అధికారులు, ప్రజలు విస్తృతంగా చర్చించారు. తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, ఆరోగ్య సేవలు, రేషన్ సరఫరాలో ఉన్న ఇబ్బందులు వంటి సమస్యలను గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. గ్రామ సభ అనంతరం గుర్రాల చెరువులో నూతన రేషన్ పాయింట్‌ను అశ్వారావుపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూపల్లి రమేష్ బాబు తో పాటు ఆత్మ కమిటీ చైర్మన్ సుంకేవల్లి వీరభద్రరావు, ఎమ్మార్వో రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, అశ్వారావుపేట సీఐ, కొక్కెరపాటి పుల్లయ్య, చిన్నం శెట్టి సత్యనారాయణ, ఆళ్ల సత్యనారాయణ, తుమ్మ రాంబాబు, చీమకుర్తి వెంకటేశ్వరరావు, రవి, అల్లాడి రామారావు, కలపాల శ్రీను, రేషన్ డీలర్ తేజ, ఆరోగ్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## అశ్వారావుపేట మార్కెట్‌లో వైట్ ఆపిల్

**డజన్ రూ.60.. పోషక ఖనిజాల ఘనిగా గుర్తింపు**



**అశ్వారావుపేట, విశాలభారతి:**

అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో ఎండాకాలంలో తాటి ముంజులకు డిమాండ్ పెరుగుతోంది. అశ్వారావుపేటలో డజన్ రూ.60కి విక్రయిస్తూ, ఆరోగ్యానికి అపార ప్రయోజనాలు అందిస్తున్నాయి. ఎండాకాలం ప్రారంభమయ్యే సరికి తాటి ముంజులు (తాటి కాయల గుజ్జు) మార్కెట్లలో విరివిగా కనిపిస్తున్నాయి. మండుతున్న ఎండల మధ్య శరీరానికి చల్లదనం కలిగించే సహజ ఆహారంగా తాటి ముంజులకు విపరీతమైన డిమాండ్ పెరుగుతోంది. అశ్వారావుపేట మండలం సహా పరిసర ప్రాంతాల్లో రోడ్ల పక్కన, చిన్నచిన్న స్టాల్స్‌లో ఇవి అమ్మకానికి ఉంచుతున్నారు. ప్రత్యేకంగా అశ్వారావుపేట సెంటర్‌లో తాటి ముంజులను డజన్‌కు రూ.60 చొప్పున విక్రయిస్తున్నారు. ధర సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండటంతో కొనుగోలు దారులు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. తాటి చెట్ల నుంచి తీసే ఈ ముంజులు పూర్తిగా సహజసిద్ధమైనవి కావడంతో ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వైద్యులు చెబుతున్నారు. తాటి ముంజుల వినియోగం వల్ల శరీరానికి చల్లదనం కలుగుతుంది. ఇవి డీహైడ్రేషన్‌ను తగ్గించడంలో సహాయపడటమే కాకుండా, శరీరంలో నీటి లోపాన్ని పూరిస్తాయి. జీర్ణక్రియను మెరుగుపరచడం, అలసటను తగ్గించడం, చర్మానికి తేమను అందించడం వంటి ప్రయోజనాలు కూడా ఉన్నాయి. వేడి కారణంగా వచ్చే దాహం, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గించడంలో కూడా ఇవి ఉపయోగపడతాయి. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు వీటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. విక్రేతలు తెల్లవారుజామునే తాటి చెట్లపైకి ఎక్కి ముంజులను సేకరించి, రోజంతా అమ్మకాలు చేస్తున్నారు. మొత్తంగా, వేసవిలో సహజంగా లభించే తాటి ముంజులు ఆరోగ్యానికి మేలు చేసే శీతలాహారంగా ప్రజాదరణ పొందుతున్నాయి.

## క్షేమంగా మీ గమ్య స్థానాలకు చేరండి



**వాజేడు, విశాలభారతి:** ములుగు జిల్లా వాజేడు మండల పరిధి పేరూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ గుర్రం కృష్ణ ప్రసాద్ గురువారం పేరూరు మార్కెట్ ప్రాంగణంలో పలు వాహనాలను తనిఖీ చేసి వాహనదారులను ఉద్దేశించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపరాదు హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం ప్రతి ఒక్క వాహనదారుడుకి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి చత్తీస్గఢ్ రాష్ట్రం నుంచి వచ్చిన వలస కూలీలకు మరియు పేరూరు ప్రాంత యువకులు క్షేమంగా మీ గమ్యస్థానానికి చేరాలని మేము ఆశిస్తున్నాము అంటూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఆలేరు మెయిన్ రోడ్డుకు కొత్త వెలుగులు



**ఆలేరు, విశాల భారతి :** ఆలేరు మున్సిపాలిటీలోని మెయిన్ రోడ్డుపై గురువారం సాయంత్రం నూతన ఐమాక్స్, బటర్ ఫ్లై వీధి దీపాలను మున్సిపల్ చైర్ పర్సన్ , వైస్ చైర్మన్, కౌన్సిలర్లు ప్రత్యక్ష పర్యవేక్షణలో ఏర్పాటు చేశారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పట్టణ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మెయిన్ రోడ్డులో లైటింగ్ వ్యవస్థను మెరుగుపరచేందుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఆలేరు దుర్గామాత ఆలయం నుంచి పాలకేంద్రం వరకు పనిచేయని పాత వీధి దీపాల స్థానంలో కొత్త ఆధునిక లైట్లు అమర్చారు. దీంతో రాత్రివేళల్లో ప్రజలకు రాకపోకలు సురక్షితంగా సాగేందుకు వీలుకానుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ బీజన బాలమణి భాస్కర్, వైస్ చైర్మన్ అంగిడి ఆంజనేయులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసభ, ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక



**దేవరుప్పుల, విశాలభారతి:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికా 99రోజుల కార్యక్రమంలో భాగంగా ఈరోజు సింగరాజుపల్లి లో జరిగిన గ్రామసభలో స్థానిక హరిజన కాలనీ ప్రధానోపాధ్యాయులు బాస్కుల అంజయ్య పాల్గొని పాఠశాల అభివృద్ధి లో భాగంగా క్వాలిటీ ఎడ్యుకేషన్, ఎఫ్ ఎల్ ఎన్, ఆర్ డబ్ల్యూ ఈ, ప్రభుత్వం విద్యా రంగంలో ప్రవేశ పెట్టిన ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, మధ్యాహ్నభోజనం, గుడ్లు, రాగిజావా, అందిస్తున్నాము అదేవిదంగా విద్యార్థులు తాగునీరుకోసం దాతల ద్వారా వాటర్ ఫిల్టర్ అరేంజ్ చేసాము. విద్యార్థులకు యోగా మెడిటేషన్ ఆటపాటలతో కూడిన వాతావరణంలో పిల్లల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాడుతున్నామని. ప్రభుత్వం వచ్చే విద్యాసంవత్సరానికి గాను న్యూ ఎడ్యుకేషన్ సిస్టం తో పాటు పాఠశాల విద్యార్థులకు 21వస్తువులతో కూడిన స్పెషల్ కిట్ అందించబోతున్నందుకు ధన్యవాదములు తెలియజేస్తూ ఇవి అమలైతే తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటిస్థానం లో ఉంటుందని తెలియజేసారు.

## ఘనంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ

**ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



**ఆలేరు, విశాలభారతి:** ఆలేరు మండలం సాయిగూడెం రామాలయం ఆవరణలో గోపు నిఖిల్ రెడ్డి నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ పవిత్ర వేడుకకు గౌరవ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరై వారు మాట్లాడుతూ శ్రీరాముడు ఇక్కడకు వచ్చి నీటి కోసం ఒక క గుండం ఏర్పరిచారు దాంట్లో ఎల్లప్పుడూ నీరు ఉంటుందని అదేవిధంగా ఒక శివలింగాన్ని కూడా ఏర్పాటు చేసి యక పూజలు చేశాడు. అని చెప్పుతు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలను ఎమ్మెల్యే అభినందించారు. గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు.

## చాడలో ప్రజాపాలన–ప్రగతి నివేదికలో భాగంగా మెగా వైద్య శిబిరం

**130 మందికి పరీక్షలు – ఉచితంగా మందుల పంపిణీ**



**మోటకొండూర్, విశాల భారతి:** మోటకొండూరు మండలం చాడ గ్రామంలో ప్రజాపాలన-ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా ఎన్‌సీడీ, టిబి స్క్రీనింగ్ వైద్య శిబిరాలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఎన్‌టీఈపీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ వంశీకృష్ణ గ్రామాన్ని సందర్శించి శిబిర నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్య సేవలను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామసభ నిర్వహణ అనంతరం పిహెచ్‌సీ వైద్యాధికారి డా. కట్టా విజయ్, డా. హారిక సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, ఉప సర్పంచ్ పెళ్లిమెల్లి భువనేశ్వర్, వార్డు సభ్యులతో కలిసి గ్రామపంచాయతీ కార్యాలయంలో రిబ్బన్ కట్ చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో గ్రామ ప్రజలకు బీపీ, షుగర్, క్యాన్సర్, టిబి మరియు రక్తపరీక్షలు నిర్వహించి మొత్తం 130 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్య పరిరక్షణలో ముందుండాలని వైద్యాధికారి డా. విజయ్, సర్పంచ్ ఆకుల శ్రీనివాస్ గ్రామ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది నరసింహ, శ్రీనివాస్, సైదులు, నటిష్, జ్యోతి, సుభాషిని, అరుణ, గ్రామపంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, ఆశా కార్యకర్తలు రమ, మంజు, జానమ్మ, గౌతమి, గ్రామ అధికారులు, నాయకులు, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ కోలాట కళాకారులకు గుర్తింపు కార్డులు



**చెక్క వెంకటేష్**

**ఆలేరు, విశాల భారతి:** ఆలేరు మండలంలో తెలంగాణ ప్రజానాట్య మండ ఆధ్వర్యంలో కోలాట కళాకారుల సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశం దుప్పెల్లి సరిత అధ్యక్షతన జరిగింది. సమావేశానికి హాజరైన తెలంగాణ ప్రజానాట్య మండ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ మాట్లాడుతూ, అర్హులైన కోలాట కళాకారులకు గుర్తింపు కార్డులు జారీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆప్షన్‌ను విడుదల చేసిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుపేద కళాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే, కోలాట వంటి జానపద కళలను కాపాడేందుకు ప్రభుత్వం గుర్తింపు కార్డులతో పాటు ఆర్థిక సాయం, పింఛన్, బీమా వంటి పథకాలను విస్తృతంగా అమలు చేసి పేద కళాకారులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రేణుక ఎల్లమ్మ కోలాట బృందం సభ్యులు భాగ్యమ్మ, మణెమ్మ, దుప్పెల్లి సరిత, రేణుక, రావణరసమ్మ, కృష్ణమ్మ, శ్రావణి, లక్ష్మి, రాజమణి, వీరమణి, వసంత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ఆలేరు నేతన్నలకు రూ.1.63 కోట్ల సాయం



**ఆలేరు, విశాలభారతి :** ఆలేరు పట్టణంలో చేనేత రుణమాఫీ కింద 150 మందికి రూ.1.50 కోట్లు, నేతన్న భరోసా పథకం కింద 460 మందికి రూ.13.80 లక్షల ఆర్థిక సాయాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ బీజాన బాలమణి భాస్కర్ చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి, మహిళా జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మా వెంకటస్వామి, టౌన్ అధ్యక్షుడు ఎజాస్ తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు

**మనాలి ఠాగూర్**



**విశాలభారతి, గోదావరిఖని:** హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం రామగుండం నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలలో గల ఆంజనేయస్వామి ఆలయాలను సందర్శించి, భక్తి శ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ భక్తులతో కలిసి ఆధ్యాత్మిక వాతావరణంలో పాల్గొన్నారు. ఆలయాలలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని,రామగుండం నియోజకవర్గం ప్రాంత ప్రజల శ్రేయస్సు, సుఖశాంతుల కోసం ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నదాన ప్రసాదం పంపిణీ చేయడం ద్వారా సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మనాలి ఠాగూర్ మాట్లాడుతూ హనుమాన్ జయంతి పర్వదినం ప్రతి ఒక్కరికీ ధైర్యం, భక్తి, నిస్వార్థ సేవకు ప్రతీక అని తెలిపారు. సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందించేందుకు ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రతి యువకుడు హనుమంతుడిలా మారాలి

**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా**



**నిజామాబాద్, విశాలభారతి:** ప్రతి యువకుడు హనుమంతుడిలా మారాలని, నిజాయితీగా ఉంటూ ధర్మాన్ని నిలబెట్టాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్త తెలిపారు. హనుమాన్ జన్మోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఉదయం సారంగాపూర్, నీరుగొండ హనుమాన్ ఆలయాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఈ పవిత్రమైన రోజు మనమందరము ఒక సంకల్పం చేయాలని, సమాజ సేవలో ముందుండాలన్నారు. ధర్మ మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఇది ఒక పండుగ మాత్రమే కాదని, మనలోని శక్తిని మేల్కొలిపే రోజు అన్నారు. శ్రీరాముడి సేవలో హనుమంతుడు చూపిన అంకితభావం, నిజాయితీ, ధైర్యం ప్రతి ఒక్కరికి మార్గదర్శకం అన్నారు. భక్తి, బలం, నిబద్ధతకు ప్రతీకైన ఆంజనేయస్వామి అందరికీ స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఇందూరులో నిర్వహించే హనుమాన్ శోభాయాత్ర తెలంగాణలోనే అతిపెద్ద శోభాయాత్రగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇల్లెందుల ప్రభాకర్, పుట్ట వీరేందర్, మాయావార్ కృష్ణ, పవన్ ముందడ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కంటి శాస్త్ర చికిత్సలు ప్రారంభం

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.. మొదటి కాట్రేక్ సర్జరీ విజయవంతంగా నిర్వహణ**



**విశాలభారతి, గోదావరిఖని:** గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో కంటి శస్త్ర చికిత్సలను ప్రారంభించామని, అవసరమైన ప్రజలు వీటిని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆప్తామలజిస్ట్ విభాగం లో శస్త్ర చికిత్సలను బుధవారం ప్రారంభించామని కలెక్టర్ తెలిపారు. ఆప్తమాలజిస్ట్ డాక్టర్ గోపికృష్ణ ఆధ్వర్యంలో నిన్న ఒక కాట్రేక్ సర్జరీ విజయవంతంగా నిర్వహించడం జరిగిందని అన్నారు.పెద్దపల్లి జిల్లాలోని ప్రజలు, గోదావరిఖని పరిసర ప్రాంతాల ప్రజలు కాట్రేక్ ఆపరేషన్లు అవసరం అయితే గోదావరిఖని జనరల్ ఆసుపత్రికి రావాలని, ఇక్కడ అవసరమైన అన్ని రకాల పరికరాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే నిజమైన అభివృద్ధి



**ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**

**విశాలభారతి, గోదావరిఖని:** పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ గురువారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 47, 48, 49 డివిజన్లు మరియు 8వ డివిజన్‌లో నిర్వహించిన గ్రామ సభ ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలు, అవసరాలు, అభిప్రాయాలను శ్రద్ధగా విన్నారు. ప్రజల నుండి వచ్చిన ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, విద్య, ఆరోగ్యం వంటి అంశాల్లో మరింత పురోగతి సాధించాలని సూచించారు. ప్రజా సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడం ద్వారా ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రజలకు దగ్గరగా పాలన చేరడం, వారి అభిప్రాయాలను ప్రణాళికల్లో ప్రతిబింబించడం ముఖ్య లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మేయర్ మహంకాళి స్వామి , డిప్యూటీ మేయర్,పాతపల్లి ఎల్లయ్య,పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ రామగుండం మున్సిపల్ కమిషనర్ జె. అరుణ శ్రీ.సంబంధిత అధికారులు, కార్పొరేటర్లు మరియు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సంపులో పడి చిన్నారి మృతి



**రాజేంద్రనగర్, విశాలభారతి :** రాజేంద్రనగర్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని గండిపేట గ్రామంలో ఓ పసిబిడ్డ ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గండిపేట గ్రామం ఎంఆర్వో కార్యాలయం సమీపంలో నివసిస్తున్న తేజస్ శ్రీకాంత్ జాధవ్ (వృత్తి: కూలీ) కుటుంబంలో ఈ విషాదం చోటుచేసుకుంది. బుధవారం ఉదయం తేజస్ తన తమ్ముడు శంకర్, తల్లి ఉషతో కలిసి పనికి వెళ్లగా, ఇంట్లో భార్య రాధిక 8 నెలల పసిబిడ్డ సౌరభ్ జాధవ్‌ను చూసుకుంటూ నిద్రపోయింది. మధ్యాహ్నం సుమారు 1 గంట సమయంలో శంకర్ ఇంటికి వచ్చి భోజనం తీసుకునే క్రమంలో వచ్చిన శబ్దంతో రాధిక మేల్కొంది. ఈ సమయంలో బిడ్డ కనిపించకపోవడంతో ఇంట్లో వెతకడం ప్రారంభించింది. ఈ క్రమంలో నీటి సంప్ మూత తెరిచి ఉండటం గమనించి లోపల చూడగా బిడ్డ నీటిలో తేలుతూ కనిపించాడు. వెంటనే బిడ్డను బయటకు తీసి రేన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్‌కు తరలించగా, అక్కడ వైద్యులు పరీక్షించి మృతుడిగా ప్రకటించారు. ఈ ఘటనలో ఎవరిపైనా అనుమానం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. బిడ్డ ప్రమాదవశాత్తు సంపులో పడిపోవడంతో మృతి చెందినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



**చౌటుప్పల్ విశాలభారతి:** పేద ప్రజల సంక్షేమము,రైతన్నల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం అని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి అన్నారు.బుధవారం రోజు చౌటుప్పల్ మున్సిపాలిటీ లక్కారం 8వ వార్డు లో స్థానిక కౌన్సిలర్ బద్రి గాలయ్య ఆధ్వర్యంలో జరిగిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక వార్డు సభకు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ..ప్రభుత్వం వచ్చిన రెండు సంవత్సరాల మూడు నెలలలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాపి, ఉచిత విద్యుత్,200 యూనిట్లు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అందరికీ రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు,రైతు భరోసా, రైతులకు మద్దతు ధర తో పాటు సన్నాలకు బోనస్, నిరుద్యోగులకు 80 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు,విద్యార్థులకు హాస్టల్లో మెస్ చార్జీల పెంపు,వందల కోట్లతో ఇంటిగ్రేటడు స్కూల్ ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నదని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొయ్యాడ సైదులు గౌడ్, మాజీ సర్పంచ్ పాశం సంజయ్ బాబు, మాజీ ఉపసర్పంచ్ లు గొడుగు లక్ష్మయ్య, గోపనబోయిన భుజంగం, జిల్లా నాయకులు ఉదరీ వెంకటేష్ మహాజన్, ఆకుల యాదిరెడ్డి, గుండె బోయిన నరసింహ,బద్రి బాలరాజ్, దేశట్ల లింగ స్వామి, కడుపు ముత్తయ్య, సయ్యద్, ఎర్ర శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పల్లె ప్రగతిలో అందరూ భాగస్వాములు కావాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపు
- అట్టహాసంగా ప్రజా పాలన
- ప్రగతి ప్రణాళిక గ్రామ సభలు

**నిజామాబాద్, విశాలభారతి:**



పల్లెలు, పట్టణాల సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలలో అన్ని వర్గాల వారు భాగస్వాములు కావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే సత్వర ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం మోస్రా మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామ సభలో కలెక్టర్ పాల్గొన్నారు. జయ జయహే తెలంగాణ రాష్ట్ర గేయంతో గ్రామసభకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. తమ సమస్యలను ప్రజలు రాతపూర్వకంగా తెలియజేసేందుకు వీలుగా గ్రామ సభ వేదిక వద్ద ఫిర్యాదుల బాక్సును అందుబాటులో ఉంచారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న లబ్ధిదారుల వివరాలను గ్రామ సభలో ఒక్కో పథకం వారీగా పేరుపేరున ప్రకటించారు. పంట రుణాల మాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకం, గృహ జ్యోతి, చేయూత పథకం, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, సన్న ధాన్యంకు బోనస్ చెల్లింపు తదితర వాటి ద్వారా గ్రామంలో లబ్ధి పొందిన వారి వివరాలు చదివి వినిపించారు. పలువురు లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల తమకు చేకూరిన ప్రయోజనాల గురించి గ్రామసభలో తమ అనుభవాలను తెలియజేస్తూ, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మునుముందు అమలు చేయనున్న పథకాల గురించి ప్రజలకు తెలియజేస్తూ, రాష్ట్ర ప్రగతి, సంక్షేమంలో వారిని భాగస్వామ్యం చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని అన్నారు. గ్రామ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనులకు సంబంధించి అందరి అభిప్రాయాలను క్రోడీకరించి సమగ్ర ప్రణాళిక రూపొందించడానికి, గ్రామ సమస్యల పరిష్కారానికి ఈ సభలు దోహదపడతాయని తెలిపారు. ప్రభుత్వం రైతు భరోసా పథకం, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500కి గ్యాస్ సిలిండర్, గృహ జ్యోతి (200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్), కళ్యాణలక్ష్మి / షాదీ ముబారక్, చేయూత పథకం కింద పెన్షన్ లు వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని, లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయడం జరుగుతోందని అన్నారు. ఎక్కడైనా అవకతవకలు జరిగితే అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తేవాలని సూచించారు. అక్రమాలకు ఆస్కారం కల్పించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇంకనూ అర్హులైన వారు మిగిలి ఉంటే, ఆయా పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడం జరుగుతుందని భరోసా కల్పించారు. ముఖ్యంగా తొలివిడత ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు తుది దశకు చేరాయని, త్వరలోనే ప్రభుత్వం రెండవ విడత కింద లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయనుందని అన్నారు. గుడిసెలు లేని తెలంగాణగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా గుడిసెలలో నివసిస్తున్న వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరీలో మొదటి ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం, అంగన్వాడీ నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు అల్పాహార పథకం, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయనుందని వివరించారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు చేరేలా అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా కృషి చేయాలని సూచించారు. గ్రామ సభలో మోస్రా సర్పంచ్ శ్రీకాంత్, మండల ప్రత్యేక అధికారి రతన్, ఎం.పీ.డీ.ఓ శ్రీనివాస్, ఎం.పీ.ఓ వెంకటేశ్వర్లు, గ్రామ కార్యదర్శి శ్రవణ్, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నాగోల్‌లో డ్రగ్ మాఫియా గుట్టురట్టు

- డ్రగ్ మాఫియాపై పోలీసులు మరోసారి గట్టి దెబ్బ
- 25 గ్రాముల ఎమ్‌డీఎంఏ స్వాధీనం
- ఇద్దరు అరెస్ట్, కీలక నిందితులు పరార్

**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్:**




హైదరాబాద్ నగరంలో డ్రగ్ మాఫియాపై పోలీసులు మరోసారి గట్టి దెబ్బ కొట్టారు. నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఓటీ ఎల్బీ నగర్ జోన్, నాగోల్ పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో 25.65 గ్రాముల ఎమ్‌డీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు.పట్టుబడిన నిందితులు జునైద్ రజా సిద్దిఖీ (36), సునీల్ సుబ్బా @ జానీ (29)గా గుర్తించారు. వీరు హిమాచల్ ప్రదేశ్ నుంచి డ్రగ్స్ తెప్పించి నగరంలో విక్రయిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ వ్యవహారంలో ప్రధాన సరఫరాదారులైన మహ్మద్ అన్సార్, రాజు ప్రస్తుతం పరారీలో ఉండగా, వారిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. నాగోల్ ఎక్స్ రోడ్ వద్ద వాహన తనిఖీల సమయంలో అనుమానాస్పదంగా ఉన్న రెండు హోండా యాక్టివా వాహనాలను ఆపి తనిఖీ చేయగా, వాహనాల్లో దాచిన ఎమ్‌డీఎంఏ డ్రగ్ బయటపడింది. అదనంగా మూడు మొబైల్ ఫోన్లు, రూ.5,190 నగదు, రెండు వాహనాలు, ఒక వెయింగ్ మెషిన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం స్వాధీనం చేసిన ఆస్తి విలువ సుమారు రూ.3.61 లక్షలు. ఈ ఆపరేషన్ మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ అవినాష్ మోహంతి ఐపీఎస్ పర్యవేక్షణలో, డీసీపీలు కే. మనోహర్ (ఎస్ఓటీ), అనురాధ ఐపీఎస్ (ఎల్బీ నగర్ జోన్), అదనపు డీసీపీ ఎం.డి. షాకిర్ హుస్సేన్ మార్గదర్శకత్వంలో విజయవంతంగా జరిగింది. డ్రగ్ మాఫియాపై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు హెచ్చరించగా, ప్రజలు అప్రమత్తంగా ఉండి సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాగోల్ పోలీస్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మద్బుల్ జానీ, సబ్ ఇన్స్పెక్టర్లు ప్రసాద్ కుమార్,రమేష్ తోపాటు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నార్సింగి పీఎస్ వద్ద ఉద్రిక్తత

**కాంగ్రెస్ నేత కాటా శ్రీనివాస్ గౌడ్ విడుదల**

**రాజేంద్రనగర్, విశాలభారతి:**



నార్సింగి పోలీస్ స్టేషన్ వద్ద గురువారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పటాన్చెరు కాంగ్రెస్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి కాటా శ్రీనివాస్ గౌడ్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేసి నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో ఈ ఉద్రిక్తత చోటుచేసుకుంది. వివరాల ప్రకారం, పటాన్చెరు నియోజకవర్గ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి భూకబ్జాలకు పాల్పడుతున్నారని కాటా శ్రీనివాస్ గౌడ్ గత రెండు రోజులుగా మీడియా సమావేశాల్లో ఆరోపణలు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఆ ఆరోపణలను ఖండిస్తూ, అవి ఆధారరహితమని పేర్కొన్నారు. ఆరోపణలను నిరూపించాలని సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో, బీరంగూడ గుట్ట భ్రమరాంబిక మల్లికార్జున ఆలయం వద్ద గురువారం ఉదయం 11 గంటలకు తడి బట్టలతో తాను హాజరవుతానని, ఎమ్మెల్యే అవినీతి చేయలేదని నిరూపించాలంటే ఆయన కూడా రావాలని శ్రీనివాస్ గౌడ్ సవాల్ విసిరారు. అయితే పరిస్థితులు ఉద్రిక్తంగా మారే అవకాశముందని భావించిన పోలీసులు ముందస్తు చర్యగా శ్రీనివాస్ గౌడ్‌ను హౌస్ అరెస్ట్ చేసి నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని, తమ నేతను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బైఠాయించి ధర్నాకు దిగారు. పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు కొంతసేపటికి శ్రీనివాస్ గౌడ్‌ను విడుదల చేశారు. అనంతరం కార్యకర్తలు ఆందోళన విరమించి అక్కడి నుంచి వెళ్లిపోవడంతో పరిస్థితి చల్లబడింది.

# గర్భిణీ స్త్రీలకు మెరుగైన వైద్య సేవలు




**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా గర్భిణీ స్త్రీలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలలో భాగంగా, జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ప్రత్యేక హెల్ప్ డెస్క్ ను గైనకాలజీ డిపార్ట్మెంట్ డాక్టర్ రాధిక, డాక్టర్ శశి జ్యోత్స్న కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. రవి రాథోడ్ మాట్లాడుతూ, గర్భిణీ స్త్రీలకు ఆసుపత్రిలోకి వచ్చిన వెంటనే అవసరమైన సూచనలు, పరీక్షలు, వైద్య సేవలపై పూర్తి సమాచారం అందించడమే ఈ హెల్ప్ డెస్క్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. హెల్ప్ డెస్క్ నెంబర్ 7993154429.ఈ నంబర్ 24 గంటలు గర్భిణీలకు అందుబాటులో ఉంటుందని గర్భిణీలు ఎదుర్కొనే సమస్యలను తక్షణమే పరిష్కరించి, వారికి సకాలంలో సేవలు అందేలా ప్రత్యేకంగా ఈ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్రత్యేకంగా 102 అంబులెన్స్ సేవలు, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం, తల్లిశిశు సంక్షేమ కార్యక్రమాలపై మార్గదర్శకత్వం అందించబడుతుందని తెలిపారు. గర్భిణీ స్త్రీలు ఆరోగ్యకరమైన గర్భధారణ సురక్షిత ప్రసవం కోసం ఈ సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. హెల్ప్ డెస్క్ ద్వారా నమోదు, పరీక్షలు, ప్రసూతి సేవలు, పోషణ సూచనలు, ప్రభుత్వ పథకాలపై సమాచారం వంటి సేవలు ఒకే చోట అందుబాటులో ఉంటాయని ఆయన వివరించారు. దీంతో గర్భిణీ స్త్రీలు ఆసుపత్రిలో తిరగాల్సిన అవసరం లేకుండా సులభంగా సేవలు పొందగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సారంగం ఆర్ యం ఓ లు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సంజయ్, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ లు కేవీ రాజు ఏ . పురుషోత్తం, లోక్య, శ్రీనివాస్, స్వామి హెచ్ఈఓ లు వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మహబూబాబాద్ జిల్లా పౌర సంబంధాల అధికారి ద్వారా జారీ చేయడమైనది.

# బండారు మహేష్‌ను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

**కుటుంబానికి అండగా ఉంటామని భరోసా**



**అశ్వారావుపేట, విశాలభారతి :** అశ్వారావుపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు బండారు మహేష్ ఇటీవల హార్ట్ సర్జరీ చేయించుకుని ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మొగళ్లపు చెన్నకేశవరావు, కొప్పుల శీను, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎస్కే పాషా, మాజీ ఎంపీటీసీ బాలయ్య పాల్గొన్నారు. బండారు మహేష్‌ను కలుసుకుని ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్స అనంతరం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు. అలాగే కుటుంబ సభ్యులతో మాట్లాడి, ఇలాంటి క్లిష్ట సమయంలో ఎలాంటి సహాయం అవసరమైనా తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆర్థికంగా లేదా ఇతర అవసరాల్లో సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. నాయకుల పరామర్శతో కుటుంబ సభ్యులు కొంత ధైర్యం పొందినట్లు తెలిపారు. స్థానిక ప్రజలు కూడా మహేష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.

# భద్రాద్రి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షునికి ఘన సన్మానం



**పాల్వంచ: విశాలభారతి:** పాల్వంచ పట్టణం బొల్లోరిగూడెం శ్రీ లలిత కామేశ్వర స్వామి (శివాలయం) ఆలయం కమిటి తరుపున ఇటీవల నూతనంగా ఎన్నికైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కిరణ్ మొదల్కర్ ను ఘనంగా సన్మానించారు. ముందుగా ఒక మొక్కను అందజేసి, పండ్లు, స్వీట్స్ అందించారు, అనంతరం శాలువాతో సన్మానించారు. భవిష్యత్తు లో మరిన్ని పదవులు అధిరోహించి మన పాల్వంచ వాసిగా కీర్తి ప్రతిష్టలు నలుదిశలా వ్యాపింప చేయాలని ఆకాంక్షించారు. సన్మానం చేసిన వారిలో ఆలయ ధర్మకర్త శివలెంక అశ్విని కుమార్, ఆలయ కమిటి సభ్యులు శనగ రామచందర్ రావు, సమ్మిడి జనార్దన్ రెడ్డి, సంగ్లోత్ రంజిత్, గంధం యాదగిరి, పోసారపు శ్రీను, జర్పుల లిఃగ్యా నాయక్,ఫారెస్ట్ శంకరన్నలు వున్నారు.

# గ్రామసభలతో ప్రజాపాలన ప్రజలకు చేరువవుతోంది

**ప్రతి ఇంటికి చేరేలా గ్రామసభల నిర్వహణ.. జిల్లా కలెక్టర్ అంకిత్**



**అశ్వాపురం విశాలభారతి:** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లావ్యాప్తంగా గ్రామ, వార్డు సభలు ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో భాగంగా అశ్వాపురం గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన గ్రామసభకు జిల్లా కలెక్టర్ అంకిత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రగతిని ప్రజలకు వివరించడమే కాకుండా గ్రామ, వార్డు స్థాయిలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించడమే ఈ సభల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. గ్రామసభలను పండగ వాతావరణంలో నిర్వహించేలా ప్రభుత్వం యంత్రాంగానికి మార్గదర్శకాలు జారీ చేసినట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో పథకాల అమలులో పారదర్శకత కోసం గ్రామస్థాయిలో పెండింగ్ దరఖాస్తులు, అర్హతలు, అవసరమైన ధృవీకరణ పత్రాల వివరాలను తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాభివృద్ధికి విద్య ముఖ్యమని పేర్కొన్న కలెక్టర్, పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందేలా నిరంతర పర్యవేక్షణ అవసరమని తెలిపారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలన్నారు. అలాగే 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు గ్రామసభల్లో పాల్గొని సమస్యలను చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బానోత్ సవర్లాల్, ఉప సర్పంచ్ తుల్లూరు ప్రకాష్, , మండల ప్రత్యేక అధికారి ఇంతియాజ్ ఖాన్, ఎంఈఓ వీరాస్వామి, తాసిల్దార్, అన్ని శాఖల అధికారులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నూతనంగా పాఠశాల భవనాన్ని ప్రారంభించిన సబ్ కలెక్టర్



**పాల్వంచ విశాలభారతి:** పాల్వంచ మండలంలోని కోయకట్టు గ్రామంలో ఈ విద్యా సంవత్సరం 202526 లో నూతనంగా మంజూరైన యం పి పి ఎస్ కోయగట్టు పాఠశాలకు భవనాన్ని గురువారం జిల్లా సబ్ కలెక్టర్ సౌరబ్ శర్మ ప్రారంభోత్సవం చేశారు. ఈ పాఠశాల భవనానికి గత భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ , గ్రామస్థులతో మట్టి ఇటుకలు తయారు చేయించి ఈ భవనాన్ని పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ వారిచే దాదాపు రూ.3 లక్షల ఖర్చులతో నిర్మించడం జరిగింది. అప్పటి కలెక్టర్ ఆదేశాలు మేరకు గ్రామస్తులు ఈ భవన నిర్మాణం పనులతో పాటు గా ఉచితంగా ఇటుకలు తయారు చేసి భవనాన్ని నిర్మించుకున్నారు. మిగిలిన రేకులు ఇతర పనులకు మూడు లక్షలతో భవనాన్ని పూర్తి చేశారు. అట్టి భవనాన్ని సబ్ కలెక్టర్ ప్రారంభోత్సవం చేసి విద్యార్థులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీరామ్ మూర్తి , ఎంపీడీవో నారాయణ , ఏ ఏ ఇ పంచాయతీరాజ్ శ్రీనివాస్ , ఏ ఇ హౌసింగ్ హేమంత్, బంద్రుగొండ సర్పంచ్ సురేష్, ఉప సర్పంచ్ వెంకట్రావు, పాఠశాల హెచ్ఎం నూనావత్ బిక్షం, టీచర్ రవికుమార్ గారు, పంచాయతీ సెక్రెటరీ నారాయణ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజల మధ్యే సమస్యల పరిష్కారం

- ఉప్పరిగూడ గ్రామసభలో ఎమ్మెల్యే రంగారెడ్డి
- ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామసభ
- ప్రభుత్వ పనితీరుపై వివరించిన ఎమ్మెల్యే



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ గ్రామంలో గ్రామసభను నిర్వహించారు. ఈ గ్రామసభకు స్థానిక ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి హాజరై ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడం జరిగింది . ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని తెలిపారు. ప్రజల వద్దకే పాలన తీసుకెళ్లడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పాలనపై విమర్శలు గుప్పిస్తూ, రాష్ట్రాన్ని అప్పుల పాలుచేసి ఆర్థికంగా దెబ్బతీశారని ఆరోపించారు. ఆ అప్పుల భారం మధ్యలోనే ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేస్తోందన్నారు. సంక్షేమ పథకాల అమలులో కొంత జాప్యం ఉన్నా, అవన్నీ అప్పుల కారణంగానేనని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు ఇవ్వడం, పేదలకు ఉచిత సన్నబియ్యం పంపిణీ, మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అలాగే పేదల సొంతింటి కలను ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నెరవేర్చుతామని చెప్పారు. రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ ఘనత అని పేర్కొంటూ, గత పాలనలో ఒక్క రేషన్ కార్డు గానీ, ఇల్లు గానీ ఇవ్వలేదని విమర్శించారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, అర్హులైన నిరుపేదలకు ఇండ్ల పట్టాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజల సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించే దిశగా గ్రామసభలు ముఖ్య పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## దూసుకెళ్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం



**విశాలభారతి, కరకగూడెం:** గ్రామపంచాయతీ పరిధిలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా సర్పంచ్ పోలేబోయిన సుజాత అధ్యక్షత గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథులుగా స్పెషల్ ఆఫీసర్ దినేష్ కుమార్ , ఎంపీడీవో ఏండివి కుమార్ పంచాయతీ సెక్రటరీ రామకృష్ణ , హౌసింగ్ ఏఈ వినీత , కరెంట్ ఏఈ రాజశేఖర్ ,ఏపీఎం విజయ్ క్రాంత, హెల్త్ ఆఫీసర్ పోలేబోయిన కృష్ణయ్య ఉప సర్పంచ్ బుడగం రాము ,ఆర్బిఐ కౌన్సిలర్ కొమరం ప్రసాద్ . పాల్గొని ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు మరియు రాబోయే పథకాల గురించి గ్రామ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖ అధికారులు, వివిధ పార్టీ మండల నాయకులు, గ్రామ పెద్దలు, వార్డ్ మెంబర్లు, ఆశ వర్కర్లు,అంగన్వాడీ వర్కర్లు, మహిళలు, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ఎస్సై పివి నాగేశ్వరరావు

**మతిస్థిమితం లేని ఓర్సు మల్లయ్య ను చేరదీత**



**విశాలభారతి, కరకగూడెం:** మండలం వట్టంవారి గుంపు గ్రామపంచాయతీ పరిధిలోని నివాసం ఉంటున్న ఓర్సు మల్లయ్య సుమారు 75 సంవత్సరాలు. గత కొన్ని నెలలుగా భార్య చనిపోవడంతో మతిస్థిమితం లేకుండా తిరుగుతుండడంతో గురువారం స్థానిక ఎస్సై పివి నాగేశ్వరరావు చేరదీసి అతనికి కటింగ్ సేవింగ్ చేయించి నూతన దుస్తులు అందజేసి ఆహారం అందించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : జూపల్లి

**రేషన్ పాయింట్ ప్రారంభం**



**అశ్వారావుపేట, విశాలభారతి :** అశ్వారావుపేట మున్సిపల్ పరిధిలోని 13వ వార్డ్ గుర్రాల చెరువు గ్రామంలో నిర్వహించిన గ్రామ సభ ఉత్సాహంగా జరిగింది. ఈ గ్రామ సభలో గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై అధికారులు, ప్రజలు విస్తృతంగా చర్చించారు.తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, ఆరోగ్య సేవలు, రేషన్ సరఫరాలో ఉన్న ఇబ్బందులు వంటి సమస్యలను గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.గ్రామ సభ అనంతరం గుర్రాల చెరువులో నూతన రేషన్ పాయింట్‌ను అశ్వారావుపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జూపల్లి రమేష్ బాబు తో పాటు ఆత్మ కమిటీ చైర్మన్ సుంకేవల్లి వీరభద్రరావు, ఎమ్మార్వో రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, అశ్వారావుపేట సీఐ, కొక్కెరపాటి పుల్లయ్య, చిన్నంశెట్టి సత్యనారాయణ, ఆళ్ల సత్యనారాయణ, తుమ్మ రాంబాబు, చీమకుర్తి వెంకటేశ్వరరావు, రవి, అల్లాడి రామారావు, కలపాల శ్రీను, రేషన్ డీలర్ తేజ, ఆరోగ్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

**భక్తి నినాదాలతో మార్మోగిన ర్యాలీ.. భారీగా పాల్గొన్న యువత, భక్తులు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** సౌత్ ఎండ్ పార్క్ నుంచి మన్సూరాబాద్, సుష్మ, పనామా మార్గంగా బి.ఎన్ రెడ్డి నగర్ వరకు హనుమాన్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీని జక్కిడి రఘువీర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీగా చేపట్టారు. భజనలు, మంగళ వాద్యాలు, జై శ్రీరామ్ నినాదాలతో సాగిన ఈ శోభాయాత్రలో భక్తులు, యువత తండోపతండాలుగా పాల్గొన్నారు. మార్గమంతా ఆధ్యాత్మిక ఉత్సాహం నిండిపోగా, ర్యాలీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో జక్కిడి మల్లా రెడ్డి, జగదీష్ యాదవ్, వరుణ్ గౌడ్, సుభాష్, భాస్కర్ యాదవ్, అనిల్ కుమార్, వేణు, అఖిల్, సాయి గౌడ్ తదితరులు పాల్గొని యాత్రను విజయవంతం చేశారు.

## పసుమాములలో అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం



**వేడుకల్లో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ పెద్ద అంబర్పేట్ డివిజన్, పసుమాముల గ్రామం నందు రామగిరి గుట్ట పై వెలిసిన స్వయంభు శ్రీ సీతారాముల వారి దివ్య కళ్యాణ మహోత్సవం దేవాలయ కమిటీ అధ్యక్షులు కొత్తపల్లి జైపాల్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి కూడా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లో భక్తుల హర్షధ్వానాల మధ్య, వేదమంత్రాల నాదంతో కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రంగారెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సమృద్ధి కోసం స్వామివారి ఆశీస్సులు కోరుకున్నట్లు తెలిపారు. శ్రీ సీతారాముల వారి కృపతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలి అని ఆకాంక్షించారు. ప్రజల మధ్యలో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూనే, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటూ ప్రజలతో అనుబంధాన్ని కొనసాగిస్తున్న నాయకుడిగా ఆయన మరోసారి గుర్తింపు పొందారు.ఈ కార్యక్రమం లో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కరాచారి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు రవీందర్ రెడ్డి, పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ పండుగల జయశ్రీ రాజు, వైస్ చైర్మన్ చామ సంపూర్ణ విజయ శేఖర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు గ్యారల శ్రీనివాస్ గౌడ్, వడ్డేపల్లి విద్యా విజయేందర్ రెడ్డి, గ్రామ పెద్దలు చర్లపల్లి శంకరయ్య గౌడ్, బాలకృష్ణ గౌడ్, అశోక్ రెడ్డి, గౌని భాస్కర్ గౌడ్, చెట్టి నవీన్ గౌడ్, చిట్టి రాజు గౌడ్, సంతోష్ రెడ్డి, కిరణ్ గౌడ్, వాసు తోపాటు గ్రామ ప్రజలు, భక్తులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కుమ్మెర ఘటన సిబిఐకి అప్పగించాలి



**ముషీరాబాద్, విశాల భారతి:** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మల్లన్న జాతరలో రజక దంపతులపై దాడి రెండు నెలల చిన్నారి మరణానికి కారణమైన ఘటనపై సిబిఐ చేత విచారణ జరిపించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ వైస్ ప్రెసిడెంట్ మేకల శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. బీసీలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు తక్షణమే బీసీ రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. కుమ్మెర గ్రామం ఘటనపై రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. ఈ ఘటనకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు ధర్నాలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవరిస్తుందని ఫైర్ అయ్యారు. కుమ్మెర ఘటన రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని దేశ స్థాయిలో ఎండగట్టేందుకు ఆర్ కృష్ణయ్య నేతృత్వంలో ర్యాగ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో జంతర్మంతర్ వద్ద భారీ ధర్నా చేపట్టామని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనను సిబిఐ కి అప్పగించాలని డిమాండ్ చేశారు. బీసీలపై జరుగుతున్న దాడులు దౌర్జన్యాలను అరికట్టేందుకు ఎస్సీ ఎస్టీల మాదిరిగా బిసి రక్షణ చట్టం తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. అలానే రాష్ట్రవ్యాప్తంగా బీసీ విద్యార్థులు బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## జయప్రకాశ్ నగర్ హనుమాన్ విగ్రహ ప్రాణ ప్రతిష్ట





- వేదఘోషల మధ్య అంగరంగ వైభవం
- భారీగా తరలివచ్చిన భక్తజనం

**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కుట్లు డివిజన్ జయప్రకాశ్ నగర్ కాలనీ గురువారం రోజు భక్తిరసంతో మునిగిపోయింది. నూతనంగా నిర్మించిన శ్రీ హనుమాన్ దేవాలయంలో విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సాహంతో నిర్వహించారు. ఆలయ కమిటీ ధర్మకర్తలు సుర్వి శ్రీనివాస్, సురేష్ వర్మల ఆధ్వర్యంలో జరిగిన ఈ మహోత్సవంలో వేద మంత్రాల నినాదాలు, హోమాలు, ప్రత్యేక పూజలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మొత్తానికి జయప్రకాశ్ నగర్‌లో జరిగిన ఈ హనుమాన్ ప్రాణ ప్రతిష్ట మహోత్సవం భక్తి, ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ చామ సంపూర్ణ విజయ శేఖర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు గ్యారల శ్రీనివాస్ గౌడ్, జోర్క గీతా, శ్రీరాములు ముదిరాజ్‌లు హాజరై పూజల్లో పాల్గొన్నారు. అలాగే తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, కుంట్లూర్ గ్రామ మాజీ సర్పంచులు చామ రాంరెడ్డి, కళ్లెం ప్రభాకర్ రెడ్డి, హయత్ నగర్ రైతు సహకార సంఘం మాజీ చైర్మన్ చామ కృష్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్ చెల్లూరి మురళీధర్ రెడ్డి, భూదాన్ కాలనీ మాజీ చైర్మన్ గున్న రాజేందర్ రెడ్డి తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఆలయ కమిటీ అధ్యక్షులు బాబురావు, ఆర్ సత్యనారాయణ, రామయ్య, నరసింహ, రాజేష్, వెంకటేష్, వి. సత్యనారాయణ, జయప్రకాశ్ నగర్ కాలనీ అధ్యక్షులు సముద్రాల సుధాకర్, భూదాన్ కాలనీ అధ్యక్షులు ఎస్ సుధాకర్, మాజీ కోఆప్షన్ మెంబర్ హజారా బేగం, సయ్యద్ పాషా, కుంట్లూర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు లాల్ మహమ్మద్, జాంగిర్‌తో పాటు స్థానిక ప్రజలు విస్తృతంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఘనంగా శ్రీ హేమాద్రి వేంకటేశ్వర స్వామి గిరి ప్రదర్శన

**అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు**



**కీసర,విశాలభారతి :** రాంపల్లి దయారలో గురువారం చైత్ర పౌర్ణమి మరియు శ్రీ హనుమత్ విజయోత్సవం శుభసందర్భాన్ని పురస్కరించుకుని, హేమాద్రి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం యందు ప్రతి పౌర్ణమి రోజున నిర్వహించే గిరిప్రదక్షిణ కార్యక్రమం నేడు అత్యంత భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించబడింది.మేళా తాళాల నడుమ భక్తులు నృత్యాలు చేస్తూ, గీతాలాపనలు చేస్తూ భక్తి భావంతో తన్మయత్వం పొందారు.అనంతరం శ్రీ వీరాంజనేయస్వామికి విశేష అభిషేకం నిర్వహించి,పుష్ప ఫల నైవేద్యాలు సమర్పించగా, వేదపండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు.ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు శ్రీ వీరాంజనేయస్వామి వారి లాకెట్ ను ప్రసాదంగా అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో చుట్టూ పక్కల ఉన్న గ్రామ ప్రజలు,మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కవాడిపల్లి గ్రామంలో ప్రజా పాలన గ్రామసభ



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** అబ్దుల్లాపూర్మెట్ మండలం, కవాడిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామసభను నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ కొలను ప్రసన్న లక్ష్మి రవీందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన .ఈ గ్రామసభకు స్పెషల్ ఆఫీసర్‌గా మండల డిప్యూటీ తహశీల్దార్ వేణు పాల్గొన్నారు. సమావేశంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి, లబ్ధిదారుల అభిప్రాయాలను తెలుసుకోవడం జరిగింది. అనంతరం గ్రామ అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, స్థానిక సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. అలాగే ZPHS స్కూల్ ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, విద్యుత్ శాఖ లైన్‌మన్ మహేందర్, ఆశా వర్కర్లు, అంగన్వాడి సిబ్బంది, డ్వాక్రా మహిళలు, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద ఎత్తున హాజరై తమ విలువైన సూచనలు, అభిప్రాయాలను వెల్లడించారు. గ్రామ స్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ఈ గ్రామసభ సమర్థ వేదికగా నిలిచిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రేమ్ కుమార్, ఉప సర్పంచ్ రాసాల రాము యాదవ్, వార్డు సభ్యులు ఎర్రకోలు నిరోషా రవి యాదవ్, కొలను శివ ప్రసాద్ రెడ్డి, రంగ అంబిక శ్రవణ్ గౌడ్, కందడి అనూష మధుసూదన్ రెడ్డి, బొడిగె సురేష్ గౌడ్, ఇరుగు సాయి, సుర్వి ఝాన్సీ విశ్వేశ్వర్ గౌడ్, గడ్డం కృష్ణవేణి గిరిబాబు, మాజీ సర్పంచ్‌లు కందడి కృష్ణ రెడ్డి, ఇరుగు చిత్తారి తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద చెరువు కట్టకు కొత్త రూపు

- అభివృద్ధి పనుల పరిశీలనలో ఎమ్మెల్యే.. రూ.18 కోట్లతో సుందరీకరణ
- మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గ తలమణికంగా గుర్తింపు పొందిన పెద్ద చెరువు కట్ట సుందరీకరణ పనులను ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పరిశీలించారు. రూ.18 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ అభివృద్ధి పనులు చెరువు కట్ట రూపురేఖలను పూర్తిగా మార్చనున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఇబ్రహీంపట్నం చెరువు కట్టను మినీ ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేసి ప్రజలకు ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కట్ట మైసమ్మ ఆలయాన్ని కూడా అభివృద్ధి చేసి భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.చెరువు కట్టపై ప్రమాదాలు జరగకుండా ఇరు వైపులా సేఫ్టీ రైలింగ్, ఆధునిక లైటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు సురక్షితంగా విహరించేందుకు, సాయంత్రం వేళల్లో కుటుంబాలతో సమయం గడపడానికి అనుకూలంగా ఈ ప్రదేశాన్ని మార్చే దిశగా పనులు కొనసాగుతున్నాయని అన్నారు .ఈ అభివృద్ధి పనులతో ఇబ్రహీంపట్నం చెరువు కట్టకు కొత్త గుర్తింపు లభించనుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్లాపూర్‌లో ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక గ్రామసభ



**అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో సమస్యల పరిష్కారానికి చర్చలు**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** రంగారెడ్డి జిల్లా,అబ్దుల్లాపూర్ గ్రామంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామపంచాయతీ ఆవరణంలో గ్రామసభను నిర్వహించారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా అదనపు డిహెచ్ఓ పాపారావు, ఎంపీడీవో వాణి, గ్రామ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్ హాజరయ్యారు. గ్రామసభలో విద్య, రెవెన్యూ, ఆరోగ్య, అటవీ శాఖలకు చెందిన అధికారులు పాల్గొని ప్రజల సమస్యలను వినిపించుకుని పరిష్కార మార్గాలపై చర్చించారు. ముఖ్యంగా సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆరోగ్య సేవల మెరుగుదలపై అధికారులు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, డ్వాక్రా మహిళా సంఘాలు, పంచాయతీ సెక్రటరీ తుల్జా ప్రసాద్, గ్రామపంచాయతీ సభ్యులు మొగుళ్ళ జీవన్ కుమార్ రెడ్డి, తాటిపల్లి రమేష్ గౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, గడ్డమీది దశరథ గౌడ్, బోడుసు రాఘవేందర్ యాదవ్, మచ్చగౌని మహేందర్ ముదిరాజ్, తూర్పునూరి శివకుమార్, బత్తిని దీపిక నాగరాజ్ గౌడ్, దర్శనం యాదయ్య, కేతావత్ నరేష్, మంజుల నరసింహ, బండి సునీత ఉపేందర్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు, యువత, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ గ్రామసభ గ్రామ అభివృద్ధికి దిశానిర్దేశం చేసిన వేదికగా నిలిచింది.

## ఎన్నికలకు మీడియాకు అనుమతి ఇవ్వాలి

- అధికారులకు వినతి పత్రం అందజేసిన స్థానిక మీడియా ప్రతినిధులు

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు ఏప్రిల్ 4న జరగనున్న నేపథ్యంలో మీడియాకు అనుమతి కల్పించాలని డిమాండ్ చేస్తూ స్థానిక మీడియా ప్రతినిధులు మున్సిపల్ అధికారులకు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగాలంటే మీడియా పాత్ర ఎంతో కీలకమని వారు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విధానాలకు అనుగుణంగా ఎన్నికల నిర్వహణ జరగాలంటే మీడియాకు పూర్తి స్థాయిలో అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు మాట్లాడుతూ.. ఎన్నికలలో పారదర్శకత, నిష్పక్షపాత వైఖరి ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. ప్రజలకు నిజమైన సమాచారం చేరేందుకు మీడియా హాజరు తప్పనిసరి అని పేర్కొన్నారు.ఈ వినతి పత్రం స్వీకరించిన మున్సిపల్ అధికారులు సంబంధిత అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో స్థానిక మీడియా ప్రతినిధులు అశోక్, సత్యనారాయణ, మహేందర్, వెంకటేష్,మహేష్, అంజి,మహేందర్ గౌడ్, యాదగిరి,క్రాంతి కుమార్, చరణ్ గౌడ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా వీర హనుమాన్

## వీర హనుమాన్ విజయ యాత్ర

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హనుమాన్ జన్మోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్బీనగర్ నియోజకవర్గంలో వీర హనుమాన్ విజయ యాత్రను విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం నుంచి తాడ్‌బాండ్ హనుమాన్ దేవాలయం వరకు సాగిన ఈ యాత్ర భక్తి నినాదాలతో మార్మోగింది. ఈ యాత్రలో హయత్ నగర్ వీరన్న గుట్ట రామాలయం వద్ద డివిజన్ నాయకులు, వివిధ కాలనీల సభ్యులు, కార్యకర్తలు, హిందూ బంధువులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కర్మన్‌ఘాట్ వద్ద నుంచి యాత్ర ప్రారంభమై భారీగా సాగింది. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ సభ్యులు, బీజేపీ నాయకులు, తాజా మాజీ కార్పొరేటర్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. యాత్ర మొత్తం జై శ్రీరామ్ నినాదాలతో నిండిపోగా, భజనలు, మంగళ వాద్యాలతో ప్రాంతం అంతా ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది. వీరన్న గుట్ట కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు, వివిధ కాలనీల అధ్యక్షులు, కార్యకర్తలు, సోదర సోదరీమణులు మరియు హిందూ బంధువులు భారీ సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేశారు.



# హనుమాన్ జయంతి విజయోత్సవ యాత్ర



**రాజేంద్రనగర్, విశాలభారతి :** హనుమాన్ జయంతి సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి గ్రామంలో ఘనంగా హనుమాన్ విజయోత్సవ యాత్ర నిర్వహించారు. గ్రామంలోని హనుమాన్ దేవాలయం నుంచి ప్రారంభమైన ఈ శోభాయాత్రలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. భక్తులతో కలిసి శోభాయాత్రలో పాల్గొని హనుమంతుడిని భక్తి శ్రద్ధలతో స్మరించారు. యాత్రలో పాల్గొన్న భక్తులు "జై శ్రీరామ్", "జై హనుమాన్" నినాదాలతో ఊరంతా మార్మోగించారు. పండుగ వాతావరణంలో శోభాయాత్ర ఉత్సాహంగా కొనసాగింది. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి భక్తులకు హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆంజనేయ స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

# వివాహ వేడుకలో పాల్గొన్న రాష్ట్ర సిపిఐ పార్టీ కార్యవర్గ సభ్యులు

**దంపతులకు ఆశీర్వాదాలు అందజేసిన ప్రముఖులు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** అబ్దుల్లాపూర్మెట్ మండలం రావి నారాయణరెడ్డి కాలనీ ఫేస్2కు చెందిన కోట్ల బాల్‌రాజ్ (లేట్) - వసంత దంపతుల కుమారుడు శ్రీకాంత్ వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ వేడుకలో రాష్ట్ర సిపిఐ పార్టీ నాయకులు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నాయకులు నూతన దంపతులు సుఖశాంతులతో, ఆనందంగా జీవించాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వాదాలు అందజేశారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద ఎత్తున హాజరై వేడుకను ఆనందంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి ముఖ్యంగా హాజరై దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల కార్యదర్శి అజ్మీర హరి సింగ్ నాయక్, బి.ఓ.సి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి ప్రసాద్, ధూపం నిరంజన్, సాకలి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# అనాజ్‌పూర్ గ్రామసభలో ప్రజా పాలనపై చర్చలు



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అబ్దుల్లాపూర్ మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామంలో గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామసభను నిర్వహించారు. ఈ గ్రామసభలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి పాల్గొని ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడారు. ప్రజా పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, లబ్ధిదారుల అభిప్రాయాలను సేకరించడం వంటి అంశాలపై చర్చలు జరిపారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల గుర్తింపు, గ్రామ సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రజలు కలిసి చర్చించడం జరిగింది. పథకాల అమలులో పారదర్శకత పెంపు కోసం ప్రజల మధ్య చర్చలు నిర్వహించారు. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఈ గ్రామసభలు సమర్థవంతమైన వేదికగా నిలుస్తున్నాయని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ సుదర్శన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ శ్రీమతి రాచపాక నవనీత మహేష్, ఉప సర్పంచ్ ఏళ్ల నరేందర్ రెడ్డి, వార్డు సభ్యులు నాతి స్వప్న శ్రీనివాస్ గౌడ్, కావలి వెంకటేష్ ముదిరాజ్, గువ్వల భరత్ కుమార్, ఏర్పుల సంధ్య బాలరాజ్, గుజ్జ రాంరెడ్డి, చిలుక యాదిరెడ్డి, ఎర్కలి బాలకృష్ణ గౌడ్, ఎల్కపల్లి సింధు మహేష్, రాగని అరవింద్, పంచాయతీ కార్యదర్శి సూరిబాబు, వివిధ విభాగాల అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# వ్యక్తిపై కత్తిపోట్ల దాడి కేసు

**ముగ్గురు నిందితుల అరెస్ట్**

**రాజేంద్రనగర్, విశాలభారతి:** మైలార్దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన కత్తిపోటు ఘటనలో పోలీసులు వేగంగా స్పందించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ నెల 1వ తేదీ అర్ధరాత్రి సుమారు 12:30 గంటల సమయంలో శాస్త్రిపురం ప్రాంతంలోని అడిబ హోటల్ సమీపంలో మొహమ్మద్ ఫహాద్ అలియాస్ ఫహాద్ బాబాపై నిందితులు దాడికి దిగారు. కత్తితో పొడిచి, గొడ్డలితో దాడి చేయడంతో అతనికి తల వెనుక భాగం, ఎడమ చెవి, భుజంపై గాయాలు అయ్యాయి. ప్రస్తుతం బాధితుడు ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు ఈ దాడికి పాత వైరం కారణమని పోలీసులు తెలిపారు. గతంలో ఫహాద్ క్రైమ్ నంబర్ 340/2025 కేసులో నిందితుడిగా ఉండగా, అప్పట్లో ప్రధాన నిందితుడు సయ్యద్ షైబాజ్‌పై దాడి చేసినట్లు సమాచారం. అదే పగతో షైబాజ్ తన స్నేహితులు సహనవాజ్ ఖాన్, రిజ్వాన్‌తో కలిసి ఈ దాడికి పాల్పడ్డాడని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో ఉపయోగించిన గొడ్డలి, కత్తి, కోడవలి వంటి ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన నిందితులను కోర్టులో హాజరు పరచగా, వారికి రిమాండ్ విధించారు.

# హనుమాన్ జయంతి వేడుకల్లో భక్తి వెల్లువ

**కొత్తపేట్, వనస్థలిపురం రైతు బజార్‌లో ఘనంగా శోభాయాత్ర**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హనుమాన్ జయంతి సందర్భంగా కొత్తపేట్ మరియు వనస్థలిపురం రైతు బజార్ వద్ద నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర భక్తి ఉత్సాహంతో ఘనంగా జరిగింది. భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటూ శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్ పాల్గొని భక్తులతో కలిసి శోభాయాత్రలో నడిచారు. ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. హనుమాన్ జయంతి వంటి పర్వదినాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. భక్తి, నమ్మకం మన జీవితాల్లో సానుకూల మార్పులకు దారి తీస్తాయని తెలిపారు. శోభాయాత్రలో భజనలు, మంగళ వాద్యాలు, జై శ్రీరామ్ నినాదాలతో ప్రాంతమంతా మార్మోగింది. స్థానిక యువత, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రభుత్వ పాఠశాలకు నూతన భవన నిర్మాణం చేపట్టాలి

**సికింద్రాబాద్, విశాలభారతి :** తార్నాక డివిజన్ పరిధిలోని విజయ డెయిరీ ప్రభుత్వ పాఠశాలకు వెంటనే నూతన భవనాన్ని నిర్మించి, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలనీ తెలంగాణ విద్యా కమిషన్ సలహాదారులు ఆర్ వెంకట్ రెడ్డి అన్నారు. విజయ డెయిరీ పాఠశాలను కాపాడాలని ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశం సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాలలో సరైన తరగతి గదులు లేకపోవడం, పాత భవనం దెబ్బతినడం, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి ప్రాథమిక సదుపాయాలు లేకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని వారు తెలిపారు. విద్యార్థుల భవిష్యతను దృష్టిలో ఉంచుకుని ఆధునిక సదుపాయాలతో నూతన భవనం నిర్మించడం అత్యవసరమని పేర్కొన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో గల ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ముఖ్యంగా సీతాఫల్మండి విద్య సంస్థల భవన నిర్మాణానికి పెండింగ్లో ఉన్న నిధులను మంజూరు చేయాలని, విజయ డెయిరీ ప్రభుత్వ పాఠశాలకు శాశ్వత భవనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నాం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ నాయకులు ఉపేందర్ యాదవ్, ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చైతన్య యాదవ్, అనిల్ కుమార్, టిజిపిటిఏ రాష్ట్ర అధ్యక్షులు మల్లికార్జున్ రెడ్డి, పవన్ రాజ్, సిఆర్పిఎఫ్ నాయకులు ప్రవీణ్, శోభ, సిపిఐ డివిజన్ కార్యదర్శి గౌస్, స్కూల్ ఉపాధ్యాయులు ప్రభాకర్, జోసెఫ్ భాను, ఉదయ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.



# ఇబ్రహీంపట్నం ఎన్నికలపై ఉద్రిక్తత

- ప్రభుత్వంపై కిషన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు
- అధికార దుర్వినియోగం ఆపాలి
- కోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఈ నేపథ్యంలో ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ప్రభుత్వం పై తీవ్ర విమర్శలు గుప్పించారు. అధికార బలంతో ఎన్నికలను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ప్రభుత్వమే దానిని ఖూనీ చేస్తున్నదని తీవ్రంగా మండిపడ్డారు. ఇలాంటి చర్యలను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరని హెచ్చరించారు. హైకోర్టులో దాఖలైన లంచ్ మోషన్‌ను కోర్టు కొట్టివేయడం ప్రభుత్వానికి గట్టి దెబ్బ అని, ఇది అధికార దుర్వినియోగానికి న్యాయస్థానం ఇచ్చిన బలమైన సమాధానమని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే ప్రయత్నాలు విఫలమవుతాయని స్పష్టం చేశారు. ఏప్రిల్ 4న జరగనున్న మున్సిపల్ ఎన్నికలను అడ్డుకోవడం మానుకుని, పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని, అధికారులను ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ఇబ్రహీంపట్నం రాజకీయాల్లో ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారగా, ఎన్నికలపై మరింత ఉత్కంఠ నెలకొంది. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంతో వైభవంగా గుంతపల్లి గ్రామంలో శ్రీ సీతారాముల కళ్యాణం

- ఘనంగా కళ్యాణ వేడుకలు
- తండోపతండాలుగా తరలివచ్చిన భక్తజనం

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**



రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం గుంతపల్లి గ్రామం బుధవారం రాత్రి భక్తి పరవశంతో నిండిపోయింది. శ్రీ సీతారాముల వారి దివ్య కళ్యాణ మహోత్సవం గ్రామ సర్పంచ్ అంతటి హేమలత జంగయ్య గౌడ్ మరియు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద మంత్రాల నడుమ, మంగళ వాద్యాల మధ్య స్వామివారి కళ్యాణం భక్తిశ్రద్ధలతో సాగింది. గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొనగా, ప్రజలు తండోపతండాలుగా తరలి వచ్చి స్వామివారి కళ్యాణాన్ని వీక్షించి ఆధ్యాత్మిక ఆనందంలో మునిగిపోయారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్లు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని స్వామివారిని ప్రార్థించారు. కళ్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు ఈ అన్నదానంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. మొత్తానికి గుంతపల్లి గ్రామంలో జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం భక్తి, ఐక్యత, సాంప్రదాయాల సౌందర్యాన్ని ప్రతిబింబించింది. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కరిమెల నర్సింగ్ రావు, గ్రామ నూతన పాలకవర్గ సభ్యులు, మాజీ సర్పంచ్ కరిమెల వెంకటేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు, యువజన నాయకులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సీబీఐటీలో సైబర్ క్రైమ్ సదస్సు




**విశాలభారతి:**

చైతన్య భారతీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలోని డిజిటల్ డిఫెన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 2026 ఏప్రిల్ 2న "సైబర్ నేరాలు మరియు అభివృద్ధి చెందుతున్న ధోరణులు" అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ప్రిన్సిపాల్ ప్రొఫ్. సి. వి. నరసింహులు మార్గదర్శకత్వంలో, స్టూడెంట్ అఫైర్స్ అసిస్టెంట్ డైరెక్టర్ డా. నాగేంద్రనాథ్, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు పి. కిరణ్మయి, కవిత అగర్వాల్ సమన్వయంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫ్. బి. శ్రీనివాస్ రెడ్డి మరియు ఇతర అధ్యాపకులు ఈ సదస్సుకు హాజరయ్యారు. పోలీసు అధికారుల బృందం ఈ అవగాహన సదస్సును నిర్వహించింది. ఇందులో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రాజేష్, సబ్‌ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, మహేష్ మరియు రాజలక్ష్మి పాల్గొని సైబర్ నేరాలపై విలువైన సమాచారాన్ని అందించారు. వక్తలు ఇటీవల పెరుగుతున్న ఇంపర్సనేషన్ కాల్స్, నకిలీ ఉద్యోగ అవకాశాలు, గూగుల్ టాస్క్ స్కామ్స్, మరియు ఫ్రాడ్ రివార్డ్ పథకాల వంటి మోసాల గురించి విద్యార్థులకు వివరించారు. సోషల్ మీడియాలోని అనధికారిక యాప్‌లను డౌన్‌లోడ్ చేయకూడదని హెచ్చరించారు. సైబర్ నేరాలను నివేదించడానికి 1930 హెల్ప్‌లైన్ నంబర్, అధికారిక వెబ్‌సైట్ cybercrime.gov.in మరియు నార్సింగి పోలీస్ స్టేషన్ వంటి సమీప కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను బ్లాక్ చేయడానికి ఉపయోగించే సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ వ్యవస్థ గురించి కూడా వివరించారు. నిజజీవిత సంఘటనల ఆధారంగా కేస్ స్టడీస్‌ను ప్రదర్శించడం ద్వారా డిజిటల్ అవగాహన మరియు బాధ్యతాయుతమైన ఆన్‌లైన్ ప్రవర్తన యొక్క ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమం చివర్లో రాజేష్‌ను అధ్యాపకులు సత్కరించారు. ఈ సదస్సు విద్యార్థులకు డిజిటల్ ప్రపంచంలో సురక్షితంగా ఉండేందుకు అవసరమైన ముఖ్యమైన జ్ఞానాన్ని అందించి ఎంతో ప్రయోజనకరంగా నిలిచింది. బాధ్యతాయుతమైన ఆన్‌లైన్ ప్రవర్తన మరియు సైబర్ నేరాలను సమయానికి నివేదించడం ద్వారా మోసాల బారి నుండి ఎలా తప్పించుకోవాలో ఈ సమావేశం స్పష్టం చేసింది.

# యంగ్ ఎంట్రప్రెన్యూర్స్ సమ్మిట్ 2026 లోగోను ఆవిష్కరించిన సీఎస్

**హైదరాబాద్:**




రాష్ట్ర యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా యంగ్ ఎంట్రప్రెన్యూర్స్ సమ్మిట్ 2026, తెలంగాణ బిజినెస్ ఎక్స్‌పో అధికారిక లోగోను గురువారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు ఆవిష్కరించారు. సమ్మిట్ ను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణరావు ఆకాంక్షించారు. యువత ఉపాధి కల్పనకు కృషి చేయడం అభినందనీయమని వివరించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు లోగో ఆవిష్కరణ చేస్తున్న సమయంలో జై సంస్థ వ్యవస్థాపక సీఈఓ వరప్రసాద్ సింగిరెడ్డి, ఆయన బృందం సైతం ఉన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎక్సిబిషన్ సెంటరులో జూన్ 26 నుండి 28, 2026 వరకు ఈ సమ్మిట్ ను నిర్వహించనున్నట్టు వరప్రసాద్ తెలిపారు. దేశవ్యాప్తంగా 300కు పైగా ఎగ్జిబిటర్లు, పారిశ్రామికవేత్తలు, ఆర్థిక సంస్థలు, స్టార్టప్‌లు, యువ వ్యాపారవేత్తలు మూడు రోజుల కార్యక్రమంలో పాల్గొంటారని స్పష్టం చేశారు. ఈ సమ్మిట్‌లో భాగంగా వివిధ రంగాల వ్యాపార ప్రదర్శన (ఎక్స్‌పో), జాతీయ స్థాయి ఎంట్రప్రెన్యూర్షిప్ కాన్ఫరెన్స్, అలాగే వ్యాపార అభివృద్ధి, మార్కెట్ అవకాశాలు, విస్తరణకు సంబంధించిన జ్ఞాన సదస్సులు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ముఖ్యంగా మహిళా వ్యాపారవేత్తలకు ప్రోత్సాహం అందించే ప్రత్యేక "విమెన్ ఎంట్రప్రెన్యూర్స్ పావిలియన్" ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ, జిల్లా స్థాయి యువతలో వ్యాపార వైవిధ్యతను పెంపొందించడం, స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించడం, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు మార్కెట్ అవకాశాలను కల్పించడం యంగ్ ఎంట్రప్రెన్యూర్స్ సమ్మిట్ ప్రధాన లక్ష్యమని చెప్పారు. అయితే, ఈ సమ్మిట్‌కు హాజరుకావాలనుకునే వారు ఉచిత విజిటింగ్ పాసుల కోసం అధికారిక వెబ్‌సైట్ (www.yes4growth.org) లో నమోదు చేసుకోవాలని సూచించారు.

# ఎమ్మెల్యే చొరవతో వెంకటాపూర్‌లో 100 వీధి దీపాల ఏర్పాటు

**హెచ్ఎండిఏ నిధులతో గ్రామంలో వెలుగులు**



**మొయినాబాద్, విశాలభారతి:** చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య చొరవతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఎండిఏ నిధుల ద్వారా వెంకటాపూర్ గ్రామానికి 100 వీధి దీపాలు మంజూరు చేయడం జరిగింది. ఈ వీధి దీపాలను గ్రామ సర్పంచ్ అర్చన అజయ్ రెడ్డి ఆధ్వర్యంలో, అవసరమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అర్చన రెడ్డి మాట్లాడుతూ వీధి దీపాల ఏర్పాటు వల్ల రాత్రివేళల్లో భద్రత పెరగడంతో పాటు ప్రజలకు సౌకర్యం కలుగుతుందని తెలిపారు. ముఖ్యంగా చీకటి ప్రాంతాల్లో వెలుగులు రావడం వల్ల ప్రమాదాలు తగ్గే అవకాశముందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎలుగుల ప్రభాకర్, వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్దవేటి విజయ్ రెడ్డి మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



**మొయినాబాద్, విశాలభారతి:** మండలంలోని పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. చిలుకూరు బాలాజీ ఆలయం నుండి మొయినాబాద్ శివాలయం వరకు నిర్వహించిన హనుమాన్ ర్యాలీ విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీ మార్గమంతా భక్తులు కీర్తనలు, భజనలు చేస్తూ ముందుకు సాగారు. యువత, మహిళలు, పెద్దలు కలిసి భారీ సంఖ్యలో పాల్గొనడంతో ప్రాంతం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది. పలు గ్రామాల్లో హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు తమ మొక్కులు చెల్లించుకుని దేవుడి ఆశీస్సులు పొందారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి ర్యాలీ ప్రశాంతంగా జరగడానికి సహకరించారు. మొత్తం మీద మొయినాబాద్ మండలంలో హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో, ఉత్సాహభరితంగా జరిగాయి

# అయ్యప్ప స్వామి దేవాలయానికి ఇన్స్పిరేషన్ వరల్డ్ రికార్డ్

**సామాజిసేవ, సమాజ ప్రభావములో శ్రేష్టత అంశంలో అవార్డు**



**బోడుప్పల్, విశాలభారతి:** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ లో శ్రీ అయ్యప్ప జన్మదిన సందర్భంగా మహాపూడి పూజ ఫౌండర్, ధర్మకర్త పూజల మహేష్ బాబు, చైర్మన్ డాక్టర్ రంజిత్ పూజల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. 2008వ సంవత్సరంలో నిర్మించిన శ్రీ అయ్యప్ప స్వామి ఆలయం అంచలంచలుగా అభివృద్ధి చెందుతూ అయ్యప్ప స్వామి కృప కటాక్షాలు భక్తులకు ఎల్లవేళలా అందిస్తుంది. ఈ అయ్యప్ప దేవాలయం అన్నదానము, సామాజిక సేవ, సమాజ ప్రభావంలో శ్రేష్ఠత అనే అంశంపై ప్రపంచ రికార్డు నెలకొల్పి, సమాజ సేవ పట్ల అసాధారణమైన కరుణ, అంకితభావాన్ని ప్రదర్శించినందుకు గుర్తింపుగా పురస్కారాన్ని పొందింది. ఈ సందర్భంగా ఆలయ పెద్దలు మాట్లాడు "ఇన్స్పిరేషన్ వరల్డ్ రికార్డ్ హోల్డర్"గా మేము అధికారికంగా ప్రకటిస్తున్నాము. ఈ ధృవపత్రం 22 మార్చి 2026న జారీ చేయబడింది. అభిరుచి వారసత్వంగా మారే చోటే స్ఫూర్తిగా నిలుస్తుందని అవార్డు రావడం ద్వారా బాధ్యతలు పెరిగాయని భక్తులకు సేవ చేయడము అదృష్టంగా భావిస్తున్నామని, భగవంతుని కృప వల్ల అవార్డు రావడం దేవాలయానికి మాకు ఎంతో గర్వకారంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సేవక్స్, మెంబర్స్ సోన్నతి గిరి ప్రసాద్, సురేష్ కుమార్, బ్రీడర్ ఈశ్వర్ రెడ్డి, డి రాజేష్, నిరంజన్, సందీప్ రెడ్డి, తులసి కుమార్, ఆనంద్, వెంకటేష్, సాయి తేజ, మల్లేష్ గౌడ్ .పూజారులు శివభూషణ్ మిశ్రా, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా హనుమాన్ విజయోత్సవ యాత్ర



**శేరిలింగంపల్లి, విశాలభారతి:** హనుమాన్ జయంతి సందర్భంగా నియోజకవర్గంలో శ్రీ వీర హనుమాన్ విజయోత్సవ యాత్ర వైభవంగా జరిగింది. బెజగం కేశవ్, చింతకింది రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బాపునగర్ శ్రీ దశాంజనేయ స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన యాత్ర గుల్‌మోహర్ పార్క్, తరానగర్, లింగంపల్లి, చందానగర్, గంగారాం మార్గాల మీదుగా హుడా కాలనీ హనుమాన్ దేవాలయం వరకు సాగింది. భక్తులు బ్యాండ్ మేళాలు, "జై హనుమాన్-జై శ్రీరామ్" నినాదాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రవి కుమార్ యాదవ్, రాజు యాదవ్, గోవర్ధన్ గౌడ్, వినయ్ కుమార్ గౌడ్, రవి యాదవ్.నవత రెడ్డి, నర్సింహ గౌడ్, రంగనాయకులు గౌడ్, పాండు గౌడ్, రాకేష్ దూబే.గోపాల్ యాదవ్, రాజు గుప్తా.దత్తు.సాయి కిరణ్ గౌడ్.సుమన్.అరవింద్ గౌడ్.హరి కృష్ణ చారి.సాయి ముదిరాజ్.రమేష్.తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద అంబర్ పేటలో లక్కీ బేకరీ ప్రారంభం

**ప్రజలకు నాణ్యమైన, చౌక ధరల ఉత్పత్తులు అందించాలని ఎమ్మెల్యే సూచన**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాగోల్ సర్కిల్ పెద్ద అంబర్పేట్ డివిజన్‌లో లక్కీ బేకరీ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. బేకరీ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందుబాటు ధరల్లో అందించేలా కృషి చేయాలని సూచించారు. వ్యాపారంలో నమ్మకం, నాణ్యత ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లక్కీ బేకరీ నిర్వాహకులు, మాజీ కౌన్సిలర్ పసుల రాజేందర్ ముదిరాజ్ మరియు వారి సోదరులు, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మారెడ్డి, పెద్ద అంబర్పేట్ మాజీ మున్సిపల్ చైర్మన్ పండుగల జయశ్రీ రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కరాచారి, మాజీ వైస్ చైర్మన్ సిద్ధంకి కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు వద్దేపల్లి విద్యా విజయేందర్ రెడ్డి, గ్యారల శ్రీనివాస్ గౌడ్, గంట లక్ష్మా రెడ్డి, కంచర్ల సత్యనారాయణ రెడ్డి, మాజీ డైరెక్టర్లు గంట శ్రీనివాస్ రెడ్డి, ముత్యాల రాజశేఖర్, స్థానిక నాయకులు అశోక్ రెడ్డి, నాగార్జున, మాజీ కోఆప్షన్ సభ్యులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అందరూ హనుమాన్ చాలీసా చదవాలి

**మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్**

**సికింద్రాబాద్, విశాలభారతి :** హనుమాన్ జయంతి సందర్భంగా బౌద్ధ నగర్ డివిజన్ లోని వారసిగూడ గంగపుత్ర సంఘం వీధిలో ప్రముఖ న్యాయవాది, గంగపుత్ర సంఘం నాయకుడు దేశ భవిన రఘు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ పాల్గొన్నారు. అలాగే అశోక్ నగర్, సంజీవపురం, అంబర్ నగర్, పుల్లయ్య బావి, ఎల్ నారాయణ నగర్ వారాసిగూడ, బౌద్ధ నగర్, సంజీవపురం తదితర బస్తీలలో నిర్వహించిన హనుమాన్ చాలీసా. పూజా, అన్నదాన కార్యక్రమాలలో పాల్గొని ప్రతి ఒక్కరు కూడా హనుమాన్ చాలీసా చదివి పిల్లల చేత కూడా చదివించాలని తెలిపారు. అనంతరం పలు అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారి పాక శ్రీనివాస్, నాయకులు రవి ప్రసాద్ గౌడ్, కట్కూరి రమేష్, మహిళా అధికారి రమా, దామెర సదానంద్, వంగల సుధాకర్, జక్కనబోయిన సంపత్ తదితరులు పాల్గొన్నారు.



# కుస్తీ బరిలో పెద్ది

ఇటీవల విడుదల చేసిన 'పెద్ది' గ్లింప్స్‌లో కుస్తీ యోధుడిగా చిత్ర కథానాయకుడు రామ్‌చరణ్ కనిపించిన తీరు అందరిని ఆకట్టుకుంది. సిక్స్‌ప్యాక్ బాడీతో పహిల్వాన్ అవతార్‌లో ఆయన స్క్రీన్‌ప్రజెన్స్ హైలైట్‌గా నిలిచింది. గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ఆయన భారీ చెక్క గదను పట్టుకొని హనుమంతుడిని స్ఫురించేలా కనిపిస్తున్నారు. కుస్తీ ఆట తాలూకు శక్తియుక్తులు, హనుమంతుడి తాలూకు ఆధ్యాత్మికత మేళవింపుతో ఈ పోస్టర్‌ను తీర్చిదిద్దినట్లు మేకర్స్ తెలిపారు. 'పెద్ది' చిత్రంలో రామ్‌చరణ్ ఆటకూలీ పాత్రలో కనిపించనున్నారు. 1980 దశకంలో సాగే పీరియాడిక్ రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల్లో ఉన్న ఈ సినిమా ఈ నెల 30న పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకురానుంది. జాన్వీకపూర్, శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందుశర్మ, బోమన్ ఇరానీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఏ.ఆర్.రెహమాన్, నిర్మాణ సంస్థ: వృద్ధి సినిమాస్, సమర్పణ: మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, నిర్మాత: వెంకట సతీష్ కిలారు, రచన-దర్శకత్వం: బుచ్చిబాబు సానా.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.